Crime Mirror
QR Code

https://epaper.
crimemirror.com/

# క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption

హైదరాబాద్
11-12-2024
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:14
సంచిక: 28

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## మరోసారి హస్తినకు సీఎం రేవంత్

పలువురు కేంద్ర మంత్రులను కలిసే అవకాశం

రాష్ట్రానికి రావాల్సిన నిధుల గురించి చర్చించే అవకాశం

గ్రాంట్ల విడుదల చేయాలనీ కేంద్ర మంత్రులను కోరే అవకాశం



మిగతా 2లో

## మోహన్‌బాబు నివాసంలో మంచు మనోజ్‌పై దాడి



జల్‌పల్లిలో మరోసారి ఉద్రిక్తత

మనోజ్‌ను అడ్డుకున్న భద్రతాసిబ్బంది

గేట్లు తీయకపోవడంతో నెట్టుకొని లోపలికి వెళ్లినమనోజ్

మంచు ఫ్యామిలీలో తారాస్థాయికి చేరిన వివాదాలు

ప్రాణహాని ఉందని అదనపు డీజీపీకి మనోజ్ దంపతుల ఫిర్యాదు

**హైదరాబాద్,(క్రైమ్ మిర్రర్):** మంచు ఫ్యామిలీలో ఉద్రిక్తతలు మరింత వేడెక్కాయి. ఉదయం నుంచి మంచు మోహన్ బాబు, ఆయన చిన్న కుమారుడు మంచు మనోజ్ మధ్య జరిగిన చర్చలు ఎలాంటి ఫలితాన్ని ఇవ్వలేదు. దీంతో సాయంత్రం భార్యతో కలిసి అడిషనల్ డీజీపీని కలిసిన మనోజ్ కాసేపటి క్రితం తిరిగి జల్?పల్లి చేరుకున్నాడు. లోనికి వెళ్లిన మంచు మనోజ్‌పై దాడి జరిగినట్లు తెలుస్తోంది. చిరిగిన చొక్కాతో మంచు మనోజ్ బయటకు రావడం కనిపించింది. ముందుగా మనోజ్ దంపతులను అక్కడున్న భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. గేట్లు తీయాలంటూ సెక్యూరిటీ సిబ్బందిపై మనోజ్ మండిపడ్డారు. తమ కుమార్తె లోపల ఉందని లోనికి వెళ్లాలని వారిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఎంత సేపటికి గేట్లు తీయకపోవడంతో నెట్టుకొని లోపలికి వెళ్లాడు. కాసేపటి తరువాత మంచు మనోజ్ చిరిగిన చొక్కాతో బయటకు రావడం కనిపించింది. ఈ సమయంలో లోనికి వచ్చిన మీడియా ప్రతినిధులపై మోహన్‌బాబు ఆగ్రహంతో ఊగిపోయారు. వారిపై చేయిచేసుకున్నారు.

మిగతా 2లో

## సంజయ్ మల్హోత్రకు అభినందనలు

మల్హోత్రకు అపారమైన అనుభవం ఉంది

సైబర్ సెక్యూరిటీ ఆర్బీఐ ముందున్న అతిపెద్ద సవాల్

ఆర్బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ వెల్లడి

ఆర్బీఐ గవర్నర్‌గా చివరిరోజు శక్తికాంతదాస్ కీలక వ్యాఖ్యలు



మిగతా 2,7లో



## ఏపీకి త్వరలో కొత్త డీజీపీ..!

ఈనెల చివరి నాటికి ముగియనున్న ద్వారకా తిరుమల రావు సర్వీస్

మళ్లీ హరీష్ గుప్తాకే డీజీపీగా అవకాశాలు

## రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం

ఎన్ని ఇబ్బందులొచ్చినా ప్రజావాణి కొనసాగిస్తాం


కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం 70 ఏళ్లు వెనక్కి

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్,(క్రైమ్ మిర్రర్):** ప్రజావాణి కార్యక్రమాన్ని భవిష్యత్తులో మరింత మెరుగుపరుస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ప్రజావాణి కార్యక్రమం

## అక్రమ వలసదారులపై అంకుశం



చట్టబద్ధ వలసదారులకు రాచమార్గం

మరోమారు స్పష్టం చేసిన ట్రంప్



మిగతా 2లో

## పార్లమెంటులో కొనసాగుతున్న ప్రతిష్ఠంభన

ఉభయసభలు నేటికి వాయిదా

విపక్షాల తీరుపై స్పీకర్ ఓంబిర్లా అసహనం

రాజ్యసభలో ఛైర్మన్‌పై ఇండియా కూటమి అవిశ్వాసం

**న్యూఢిల్లీ,(క్రైమ్ మిర్రర్):** అదానీ ముడుపుల వ్యవహారంపై పార్లమెంటు దద్దరిల్లుతోంది. గత కొన్నిరోజులుగా జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లో అదానీ ముడుపుల విషయం, మణిపూర్ సంక్షోభంపై చర్చ జరగాలని ప్రతిపక్ష ఎంపీలు ఉభయ సభల్లో పట్టుబడుతున్నారు. అయితే ఈ విషయాలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధపడడం లేదు.

## కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి ఎస్ఎం కృష్ణ కన్నుమూత

సంతాపం తెలిపిన ప్రధాని మోదీ, ప్రముఖులు



**బెంగళూరు,(క్రైమ్ మిర్రర్):** కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి ఎస్ఎం కృష్ణ (92) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం తెల్లవారుజామున బెంగళూరులోని సదాశివనగర్‌లో తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన స్వగ్రామం మద్దూరులోని సోమనహళ్లిలో బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఎస్?ఎం కృష్ణ మృతి నేపథ్యంలో కర్ణాటక ప్రభుత్వం 3 రోజులు సంతాప దినాలుగా ప్రకటించింది.

మిగతా 2లో



## ఇది ప్రజాపాలన కాదు.. ప్రజాపీడిత పాలన

కాంగ్రెస్ ఒక్క హామీని సక్కగా నిలబెట్టుకోలేదు : కేటీఆర్

**హైదరాబాద్,(క్రైమ్ మిర్రర్):** కాంగ్రెస్ పార్టీ ఎలాగైనా అధికారంలోకి రావాలని ఇష్టంవచ్చినట్లు హామీలు ఇచ్చి ఇప్పుడు అమలు చేయటానికి నానా కారణాలు చెబుతుందని మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు.

మిగతా 2లో

## 46 జీవోపై ప్రభుత్వ వైఖరి ఏంటి?

పోస్టుల భర్తీ విషయంలో అవలంబించిన విధానం ఏమిటి?

సరైన కౌంటర్ దాఖలు చేయండి

తెలంగాణ ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు ఆదేశం

తదుపరి విచారణను జనవరి 27కు వాయిదా

**హైదరాబాద్,(క్రైమ్ మిర్రర్):** రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి సర్వోన్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది. తెలంగాణలో 5010 పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీ కోసం రేవంత్ రెడ్డి సర్కార్ జీవో నెంబర్ 46ను సవాలు చేస్తూ.. సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు కాగా..



మిగతా 2లో

## ఏపీకి త్వరలో కొత్త డీజీపీ..!

అమరావతి,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): కొత్త ఏడాదిలో ఆంధ్రప్రదేశ్‌కు కొత్త డీజీపీ వచ్చే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుత డీజీపీ ద్వారకా తిరుమల రావు ఈ ఏడాది చివరిలో రిటైర్ కానున్నారు. ఆయన పదవికాలం పొడిగించే అవకాశం లేదని తెలుస్తోంది. ఇప్పటి వరకూ చీఫ్ సెక్రటరీ పదవీ కాలం పొడిగించేవారు కానీ డీజీపీ పదవి కాలాన్ని పొడిగించిన సందర్భాలు మాత్రం లేవు. ఈ క్రమంలో ప్రస్తుత డీజీపీ ద్వారకా తిరుమలరావు పదవి కాలం పొడిగింపునకు సీఎం చంద్రబాబు ప్రయత్నం చేస్తారా? మరొకరికి ఛాన్స్ ఇస్తారా? అన్నది త్వరలో తెలియనుంది. ఇప్పటికే ఆయన రిటైర్మెంట్ డేట్ పై సీఎఫ్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఉన్న ఐపీఎస్ అధికారుల్లో అత్యంత సీనియర్ ద్వారకా తిరుమలరావు. ఎన్నికల సంఘం ఎన్నికల సమయంలో రాజేంద్రనాథ్ రెడ్డిని డీజీపీగా తప్పించింది. నిజానికి ఆయన సీనియార్టీలో టాప్ టెన్ లో లేరు. కానీ నాటి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి, మనోజ్ అనుకుని ఆయనను అందలం ఎక్కించారు. ఎన్నికల సమయంలో ఈసీ ఆయనను తప్పించి సీనియర్టీలో మొదటిస్థానంలో ఉన్న ద్వారకా తిరుమలరావును కూడా కాదని హరీష్ కుమార్ గుప్తాకు ఛాన్స్ ఇచ్చింది. ప్రభుత్వం ఏర్పడిన తరవాత కొన్నాళ్లు గుప్తానే డీజీపీగా ఉన్నారు. కానీ తర్వాత ద్వారకా తిరుమలరావుకు ఛాన్స్ ఇచ్చారు. చంద్రబాబు డీజీపీ విషయంలో నిబంధనల ప్రకారం వెళ్తారని, సీనియార్టీకి గౌరవం ఇస్తారని, అదేసమయంలో సమర్థత కూడా చూస్తారని అధికారవర్గాలు అంచనా వేస్తున్నాయి. సీనియార్టీ ఉన్నా అంచనాలకు అనుగుణంగా పని చేస్తారని అనుకోకపోతే పదవి ఇవ్వరని కూడా అనుకుంటున్నారు. అందువల్లనే ద్వారకా తిరుమలరావు తర్వాత మళ్లీ హరీష్ గుప్తాకే డీజీపీగా ఛాన్స్ ఇచ్చే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. ఎవరు డీజీపీగా ఉన్నా వైసీపీ హయాంలో సవాంగ్,

## మరోసారి హస్తినకు సీఎం రేవంత్

హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మరోసారి ఢిల్లీ పర్యటనకు వెళ్తున్నారు. ఈసారి ఒంటరిగా కాకుండా.. కుటుంబ సమేతంగా హస్తినకు వెళ్తున్నారు రేవంత్ రెడ్డి. మొదట ఢిల్లీకి వెళ్లి.. అటు నుంచి రాజస్థాన్‌లోని జైపూర్‌కు వెళ్లనున్నారు. ఈ నెల 11, 12, 13 తేదీల్లో సీఎం రేవంత్ రెడ్డి.. అక్కడే ఉండనున్నట్టు అధికారిక వర్గాలు తెలిపారు. కాగా.. మంగళవారం సాయంత్రమే శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఢిల్లీకి పయనం కానున్నారు. అక్కడి నుంచి జైపూర్‌కు వెళ్లనున్నారు. జైపూర్‌లో తమ బంధువుల వివాహ వేడుక ఉండగా.. దానికి రేవంత్ రెడ్డి కుటుంబ సమేతంగా హాజరుకానున్నారు. జైపూర్‌లో వివాహ కార్యక్రమానంతరం.. రేవంత్ రెడ్డి మళ్లీ ఢిల్లీకి చేరుకోనున్నట్టు తెలుస్తోంది. ఓవైపు.. బంధువుల పెళ్లికి హాజరవటమే కాకుండా.. మరోవైపు రాజకీయ వ్యవహారాల్లో కూడా రేవంత్ రెడ్డి పాల్గొననున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో.. పలువురు కేంద్ర మంత్రులను కలిసేందుకు ఇప్పటికే రేవంత్ రెడ్డి అపాయింట్మెంట్లు కూడా తీసుకున్నట్టు సమాచారం. వివిధ పథకాల కింద రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ఆయా శాఖల నుంచి గ్రాంట్లను విడుదల చేయాలని కేంద్ర మంత్రులను కోరే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. మరోవైపు.. ఈ మూడు రోజుల పర్యటనలో భాగంగానే.. సీఎం రేవంత్ రెడ్డి ఏఐసీసీ నేతలతో కూడా భేటీ అయ్యే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. పీసీసీ కార్యవర్గం ఏర్పాటుపై చర్చించే అవకాశం ఉండటంతో.. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్ దీపా దాస్‌మున్షీ కూడా ఢిల్లీలో అందుబాటులో ఉండనున్నట్టు సమాచారం. వీటితో పాటు.. రేవంత్ రెడ్డి ఎప్పుడు ఢిల్లీకి వెళ్లినా వినిపించే.. ఇప్పుడో అప్పుడో అంటూ ఊరించే.. మంత్రివర్గ విస్తరణ అంశం కూడా అధిష్ఠానం దగ్గర ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉండొచ్చన్న చర్చ కూడా జరుగుతోంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో.. ఈ నెలాఖరులోగా మంత్రివర్గ విస్తరణపై ఈసారైనా ఓ నిర్ణయం వెలువడుతుందని పార్టీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. అటు ఫ్యామిలీ టూర్.. ఇటు పొలిటికల్ టూర్ రెండూ కలిపి మూడు రోజుల పాటు రేవంత్ రెడ్డి బిజీబిజీగా గడపనున్న నేపథ్యంలో ఈ పర్యటనకు సర్వత్రా ప్రాధాన్యత సంతరించుకుంది.

## అక్రమ వలసదారులపై అంకుశం

వాషింగ్టన్ (క్రైమ్ మిర్రర్): తాను అధ్యక్ష పదవి చేపట్టగానే అక్రమ వలసదారులు అందరినీ అమెరికా నుంచి వెళ్లగొట్టి, చట్టబద్ధంగా వలస వచ్చేవారికి మార్గం సులువు చేస్తానని కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఇది భారతీయులకు శుభవార్త కావచ్చు. ఈ మేరకు ఆయన ఎన్.బి.సి. టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివిధ అంశాలు వెల్లడించారు. 'అమెరికాలో సాధికారికంగా ప్రవేశం పొందాలను కునేవారు ఈ దేశాన్ని ప్రేమించాలి. స్టాట్యూ ఆఫ్ లిబర్టీ అంటే ఏమిటో చెప్పగలగాలి' అని ట్రంప్ అన్నారు. 'కొన్ని దేశాల జైళ్ల నుంచి నేరస్థులు నేరుగా అమెరికాకు వస్తున్నారు. అలాంటి 13,099 మంది నేరస్థులు అమెరికా వీధుల్లో స్వేచ్ఛగా తిరుగుతున్నారు. ఈ ప్రమాదకర వ్యక్తులను మన దేశంలో ఉండనివ్వకూడదు. తక్షణం వెళ్లగొట్టాలి'అని ఉద్ఘాటించారు. అమెరికాకు అక్రమంగా వలస వచ్చిన తల్లిదండ్రుల సంతానం (డ్రీమర్స్)లో చాలామంది ఇక్కడే పుట్టి పెరిగారని, వారిలో చాలామంది గొప్ప ఉద్యోగాలు, వృత్తులు చేస్తున్నారని చెప్పారు. వారి సమస్యను పట్టించుకుంటానని స్పష్టంచేశారు. ప్రతిపక్ష డెమోక్రాట్లతో కలసి ఒక పరిష్కారం కనుగొంటానని వివరించారు.పొరుగు దేశాలైన కెనడా, మెక్సికోల నుంచి అమెరికాలోకి లక్షల మంది అక్రమ వలసదారులు పోటెత్తుతున్నారని, దీన్ని నిరోధించకపోతే ఆ రెండు దేశాలపై 25 శాతం సుంకాలు విధిస్తానని ఇటీవల ట్రంప్ ప్రకటించారు. దీనిపై రెండు దేశాలు హాహాకారాలు చేయగా కెనడా, మెక్సికోలు అమెరికాలో 51వ, 52వ రాష్ట్రాలుగా చేరిపోవడం మంచిదని ఆయన సలహా ఇచ్చారు. అమెరికా ఇప్పటికే కెనడాకు 10,000 కోట్ల డాలర్లు, మెక్సికోకు 30,000 కోట్ల డాలర్ల చొప్పున రాయితీలు ఇస్తోందనీ, వీటిని కట్టిపెట్టాల్సి ఉందన్నారు. చైనా తదితర దేశాలపై సుంకాలు పెంచితే సరకుల ధరలు పెరిగి సామాన్య అమెరికన్ పౌరులు నష్టపోతారని కంపెనీల సీఈవోలు కొందరు చేస్తున్న హెచ్చరికలను ట్రంప్ తోసిపుచ్చారు. సుంకాల సాయంతో తాను యుద్ధాలు ఆపానన్నారు.

## కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి ఎస్ఎం కృష్ణ కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

పూర్తి అధికారిక లాంఛనాలతో ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు తెలిపింది. ఎస్?ఎం కృష్ణ మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం తెలిపారు. 'కృష్ణ ఒక అద్భుతమైన నేత. అన్ని వర్గాల ప్రజల నుంచి అభిమానాన్ని అందుకున్నారు. తన జీవితాంతం ఇతరుల కోసం పాటు పడ్డారు. కర్ణాటక సీఎంగా అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుంటాయి. ప్రత్యేకంగా మౌలిక సదుపాయల కల్పనపై ఆయన ఎక్కువ దృష్టి సారించారు. ఎస్ఎం కృష్ణలో గొప్ప పాఠకుడు, ఆలోచనాపరుడు ఉన్నారు' అని ఎక్స్? వేదికగా తెలిపారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడుతో పాటు పలువురు నేతలు ఎస్?ఎం కృష్ణ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మైసూర్‌లోని మహారాజా కళాశాలలో ఎస్ఎం కృష్ణ పట్టభద్రుడయ్యారు. బెంగళూరులోని ప్రభుత్వ న్యాయ కళాశాలలో చదివారు. ఆ తర్వాత కాంగ్రెస్‌లో గుర్తింపు పొందారాయన. 1971- 2014 వరకు, అతను వివిధ సమయాల్లో లోక్‌సభ, రాజ్యసభ సభ్యునిగా సేవలందించారు. డిసెంబర్ 1989 నుండి జనవరి 1993 వరకు కర్ణాటక అసెంబ్లీ స్పీకర్‌గా కూడా పని చేశారు. ఆ తర్వాత ఎస్ఎం కృష్ణ 1999-2004 వరకు కర్ణాటక 16వ ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. ఆయన హయాంలో ఐటీ ఇండస్ట్రీలో అభివృద్ధిలోకి వచ్చింది. ఆ తర్వాత 2004-2008 వరకు మహారాష్ట్ర గవర్నర్‌గా, కేంద్ర విదేశాంగ మంత్రిగా పని చేసిన అనుభవం ఆయన సొంతం. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం రావడం, కర్ణాటకలో మారిన పరిస్థితుల నేపథ్యంలో 2017 మార్చిలో బీజేపీలో చేరారు. చివరిసారిగా 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీలో చేరినప్పుడు బహిరంగంగా ప్రచారం చేశారు. ఆ తర్వాత ఆయన క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకున్నారు. కర్ణాటక అభివృద్ధికి ఆయన చేసిన సేవలు అన్నీఇన్నీ కావు.

# మోహన్‌బాబు నివాసంలో మంచు మనోజ్‌పై దాడి

(మొదటి పేజీ తరువాయి)

బౌన్సర్ల దాడిలో ఓ కెమెరామెన్ కిందపడిపోయారు. మీడియా ప్రతినిధులను బయటకు నెట్టి బౌన్సర్లు గేటుకు తాళం వేశారు. మరోవైపు మంచు కుటుంబంలోని వివాదాలు పరస్పర ఫిర్యాదులతో రచ్చకెక్కాయి. మోహన్‌బాబు ఫిర్యాదు మేరకు హైదరాబాద్ పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌లో మనోజ్?పై కేసు నమోదైంది. ఇవాళ పెద్దమనుషుల సమక్షంలో జరిగిన మోహన్‌బాబు, విష్ణు, మనోజ్ మధ్య జరిగిన చర్చలు విఫలం అయ్యాయి. ఇది ఆస్తికోసం కాకుండా ఆత్మగౌరవం కోసం చేస్తున్న పోరాటమని మనోజ్ తెలిపారు. తన భార్య మౌనికతో కలిసి అదనపు డీజీపీ మహేశ్ భగవత్‌ని కలిశారు. న్యాయం కోసం స్టేషన్లో ఫిర్యాదు చేస్తే పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ప్రాణహాని ఉందని, భద్రత కల్పించాలని వారు అదనపు డీజీపీకి విజ్ఞప్తి చేశారు.రంగారెడ్డి జిల్లా జల్‌పల్లిలోని మంచు మోహన్ బాబు ఇంటి వద్ద ఉదయం నుంచి హైడ్రామా నెలకొంది. న్యాయం చేయాలంటూ మనోజ్ అదనపు డీజీపీ మహేశ్ భగవత్‌ని కలిసే వరకు పరిస్థితులు దారితీశాయి. ఇంట్లో ఉండగా గుర్తుతెలియని వ్యక్తులు తనపై దాడికి యత్నించారని మనోజ్ పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కుమారుడు మనోజ్?తో పాటు ఆయన భార్య మౌనికతో తనకు హాని ఉందని రాచకొండ కమిషనర్‌తో పాటు పహాడీషరీఫ్ పీఎస్?లో మోహన్ బాబు సైతం ఫిర్యాదు చేశారు. ఇరువురి ఫిర్యాదులను స్వీకరించిన పోలీసులు కేసులు నమోదు చేశారు. అయితే నిన్న పెద్ద మనుషుల సమక్షంలో మోహన్ బాబుకు, మనోజ్?కు మధ్య జరిగిన చర్చలు విఫలం అయ్యాయి. ఈ నేపథ్యంలో ఇరువురు స్టేషన్లో పరస్పరం ఫిర్యాదులు చేశారు. తాజాగా ఇవాళ విదేశాల నుంచి తిరిగి వచ్చిన పెద్ద కుమారుడు విష్ణుకు మోహన్ బాబు ఎయిర్?పోర్ట్?లో స్వాగతం పలికి ఇంటికి తీసుకొచ్చారు. అనంతరం సన్నిహితుల సమక్షంలో మోహన్ బాబు, విష్ణు, మనోజ్ సమస్య పరిష్కారానికి చర్చలు జరిపారు. ఈ క్రమంలోనే కాసేపటికి ఉన్నపళంగా చర్చల మధ్యలోంచే భార్య మౌనికతో పాటు బౌన్సర్లను తీసుకొని మనోజ్ బయటకు వచ్చారు. చర్చల సమయంలో తన భార్యతో పాటు తన బౌన్సర్లను బయటకు పంపే ప్రయత్నం చేశారని మనోజ్ మీడియాకు తెలిపారు. పోలీసులు సైతం తనకు రక్షణ కల్పిస్తామని నమ్మబలికి తన బౌన్సర్లనే బెదిరించారని మనోజ్ వివరించారు. పోలీసుల ఏకపక్ష ధోరణిని ఖండిస్తున్నానని స్పష్టం చేశారు. ఈ వివాదంలో తన భార్యతో పాటు 7 నెలల కుమార్తెను లాగడం అమానుషం అంటూ మనోజ్ ఆవేదన వ్యక్తం చేశారు. మోహన్ బాబు నివాసం వద్ద నుంచి మనోజ్ వెళ్లిపోయిన తర్వాత ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మనోజ్ బౌన్సర్లకు, విష్ణు బౌన్సర్లకు మధ్య వివాదం తలెత్తి ఘర్షణకు దారితీసింది. జోక్యం చేసుకున్న విష్ణు ఇరువర్గాల బౌన్సర్లకు సర్దిచెప్పి పరిస్థితి అదుపులోకి తెచ్చారు. మనోజ్ తరఫు బౌన్సర్లను విష్ణు గేటు బయటకు పంపించారు. అనంతరం ఆయన తరఫు బౌన్సర్లను మందలించారు. ఈ క్రమంలో మనోజ్ తరఫు బౌన్సర్లను కూడా భూమా మౌనిక మందలించారు. ఘర్షణ వాతావరణం తలెత్తేలా ప్రవర్తించొద్దని సూచించారు.అనంతరం బౌన్సర్లంతా గేటులోపలికి వెళ్లారు. ఇదిలా ఉండగా మోహన్‌బాబు నివాసానికి ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి, సీఐ గురువారెడ్డి చేరుకున్నారు. మోహన్ బాబు వాంగ్మూలం నమోదు చేసుకుని వెళ్లిపోయారు. అనంతరం ఓ న్యాయవాది మోహన్‌బాబు ఇంట్లోకి వెళ్లారు. తదుపరి తీసుకోవాల్సిన చర్యల గురించి, చట్టప్రకారం ముందుకెళ్లాల్సిన తీరు గురించి మోహన్‌బాబు న్యాయవాదితో చర్చించినట్లు సమాచారం. మరోవైపు ఏ కుటుంబంలోనైన గొడవలు సర్వసాధారణమని ఎంతో మంది కుటుంబాల్లో వివాదాలను పరిష్కరించి కలిపానని మోహన్ బాబు తెలిపారు. తమ కుటుంబంలో తలెత్తిన వివాదాన్ని కూడా సామరస్యంగా పరిష్కరించుకుంటామని వెల్లడించారు. కానీ పరిస్థితులు అందుకు భిన్నంగావున్నాయి. ఆత్మ గౌరవం కోసం చేస్తున్న పోరాటంలో తనకు న్యాయం జరిగే వరకూ ఎక్కడివరకైనా వెళ్తానని మనోజ్ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే భార్య మౌనికతో వెళ్లి డీజీపీ జితేందర్?ను కలిశారు. పోలీసుల తీరుతో పాటు తనకు జరుగుతున్న అన్యాయం గురించి వివరించారు. ఇక ఈ ఘటనలో పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది.

# పార్లమెంటులో కొనసాగుతున్న ప్రతిష్ఠంభన

దీంతో ఉభయసభలూ ప్రారంభమైన కొద్దిసేపటికే వాయిదా పడుతున్నాయి. మంగళవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైన కొద్దిసేపటికే ఉభయసభలు వాయిదాపడ్డాయి. లోక్‌సభ ప్రారంభమైన 6 నిమిషాలకే వాయిదాపడింది. సభలో గందరగోళం నెలకొనడంతో స్పీకర్ ఓం బిర్లా సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. ఈ సందర్భంగా స్పీకర్ పార్లమెంటు గౌరవాన్ని కాపాడాలని అధికార, ప్రతిపక్ష ఎంపీలను కోరారు. సభలో ఎంపీలు పార్లమెంటు గౌరవాన్ని కాపాడేలా ప్రవర్తిస్తే.. ప్రజల్లోకి మంచి సందేశం వెళుతుంది అని ఆయన అన్నారు. పార్లమెంటులో విపక్షాల నిరసనలపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అసహనం వ్యక్తంచేశారు. 'మనది ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం. ప్రజల ఆశలు, ఆకాంక్షలను మనం నెరవేర్చాలి. మనమందరం సభా గౌరవాన్ని కాపాడుకోవాలి. కానీ, గత కొన్ని రోజులుగా జరుగుతున్న సంఘటనలు బాగుండటం లేదు' అని ఆయన పేర్కొన్నారు. ఈక్రమంలోనే ఇరు సభలు రేపటికి వాయిదా పడ్డాయి. మరోవైపు సభ వాయిదా అనంతరం అదానీ వ్యవహారంపై కేంద్రప్రభుత్వం సమాధానం ఇవ్వాలని పార్లమెంటు వెలుపల ప్రతిపక్ష ఎంపీలు డిమాండ్ చేస్తూ నిరసన చేశారు. సభలు వాయిదాల పర్వం నేపథ్యంలో పార్లమెంటు సజావుగా నడపకూడదని ప్రభుత్వం నిర్ణయించుకుందని కాంగ్రెస్ సీనియర్ నేత కెసి వేణుగోపాల్ విమర్శించారు. కాగా, మరోవైపు రాజ్యసభలో కూడా ఇదే పరిస్థితి కొనసాగింది. సభలో గందరగోళం నెలకొనడంతో రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌కర్ మధ్యాహ్నం 12 గంటలకు సభను వాయిదా వేశారు. తిరిగి సభ పారంభమైనా మధ్యాహ్నం 1 గంటకు మరోసారి వాయిదాపడింది. ఇకపోతే పార్లమెంటులో మంగళవారం కీలక పరిణామం చోటుచేసుకుంది. రాజ్యసభకు ఛైర్మన్‌గా ఉన్న ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ పై కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. ఈక్రమంలో ఆయన పక్షపాతిగా వ్యవహరిస్తున్నారంటూ ఆక్షేపించింది. ఈ అవిశ్వాస తీర్మాణానికి తృణమూల్ కాంగ్రెస్, ఆప్‌తో సహా ఇండియా కూటమి నేతలు మద్దతిచ్చినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు 50 మంది ఎంపీల మద్దతు కావాల్సి ఉంటుంది. అయితే, 70 మంది ఎంపీలు తమకు మద్దతుగా సంతకాలు చేశారని కాంగ్రెస్ నాయకురాలు రణజీత్ రంజన్ ఓ మీడియా సంస్థతో పేర్కొన్నారు.

## 46 జీవోపై ప్రభుత్వ వైఖరి ఏంటి?

(మొదటి పేజీ తరువాయి)

ప్రతివాది అయిన తెలంగాణ ప్రభుత్వానికి ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. ప్రభుత్వం జారీ చేసిన 46 జీవోను సవాలు చేస్తూ.. కొందరు అభ్యర్థులు మొదట హైకోర్టును ఆశ్రయించగా.. వారి వాదనలను రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. ఈ మేరకు ఆగస్టు 28వ తేదీన ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వెలువరించింది. దీంతో.. హైకోర్టు తీర్పును సవాలు చేస్తున్న మాటూరి శ్రీకాంత్ సహా.. 74 మంది అభ్యర్థులు సుప్రీం కోర్టును ఆశ్రయించారు.అభ్యర్థులు దాఖలు చేసిన పిటిషన్‌పై.. జస్టిస్ అభయ్ ఎస్ ఓక, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. ఈ క్రమంలోనే.. ప్రతివాదులైన తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. 46 జీవోపై తమ వైఖరి, పోస్టుల భర్తీ విషయంలో అవలంబించిన విధానంపై కౌంటర్ దాఖలు చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను జనవరి 27వ తేదీకి వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో.. బాధితుల తరఫు న్యాయవాది ఆధిత్య సోంఢీ.. కేసు పరిష్కారమయ్యే వరకు ఖాళీగా ఉన్న 900 పోస్టుల భర్తీని నిలిపేయాలని వాధించారు. స్పందించిన సుప్రీం కోర్టు.. తదుపరి విచారణ వరకు వేచిచూడాలని స్పష్టం చేసింది. బాధితుల పక్షాన విచారణకు బీఆర్ఎస్ నాయకులు దాసోజు శ్రవణ్, ఏనుగుల రాకేష్ రెడ్డి కూడా హాజరయ్యారు. అయితే.. పోలీస్ ఉద్యోగాల భర్తీ కోసం జోవో నెంబర్ 46ను తెలంగాణ ప్రభుత్వం జారీ చేయగా.. దాన్ని డిమాండ్ చేస్తూ.. ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులు నిరసనకు దిగిన విషయం తెలిసిందే. జీవో నెంబర్ 46ను రద్దు చేయాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ ధర్నాలు నిర్వహించారు. కాగా.. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నాటి పరిస్థితులకు అనుగుణంగా జీవో 46 ను తీసుకొచ్చింది. అయితే దీని వల్ల చాలా మంది అర్హులు ఉద్యోగాలు కోల్పోవాల్సి వస్తుందని పోలీసు ఉద్యోగార్థులు పెద్ద ఎత్తున ఉద్యమం చేశారు. జీవో 46ను రద్దు చేయాలని తెలంగాణ హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టివేయడంతో భాదితులు.. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

## ఇది ప్రజాపాలన కాదు.. ప్రజాపీడిత పాలన

ఇది ప్రజా పాలన కాదు.. ప్రజా పీడిత పాలన అని మాజీ మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో ప్రజల వేదన అరణ్య రోదనగానే మిగిలిందని విమర్శించారు. రైతులను చెరబట్టారని, పేదల ఇండ్లు కూలగొట్టారని ధ్వజమెత్తారు. రైతుబంధు ఎత్తేశారని, రైతుబీమాకు పాతరేశారని, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ మాయం చేశారని, అమ్మవడిని ఆగం చేశారని దుయ్యబట్టారు. నిరుద్యోగుల ఉసురు పోసుకున్నారని, ఏక్ పోలీస్ అన్న పోలీసులను అణగదొక్కారని చెప్పారు. హామీల అమలు అడిగిన ఆడబిడ్డలు, ఆశాలను అవమానించారని మండిపడ్డారు. టీఎస్ టీజీగా చేసి చార్మినార్, కాకతీయ కళాతోరణాలను తొలగించారన్నారు. తెలంగాణ బిడ్డలు లాఠీలకు, తూటాలకు ఎదురొడ్డి ఆత్మబలిదానాలతో ఉద్యమిస్తున్నప్పుడు.. సమైక్యవాదుల పంచనచేరి వంచన చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార అహంకారంతో ఇప్పుడు ఏకంగా అమ్మనే మార్చారని విమర్శించారు. చరిత్రను చెరిపేస్తామన్న భ్రమలో తెలంగాణ ప్రజలను ఏమారుస్తాం అనుకుంటే పొరపాటేనని చెప్పారు. తెలంగాణ అన్నీ గమనిస్తున్నది, కాలంబు రాగానే కాటేసి తీరుతుందన్నారు.

## రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు చేసిన ఏడాది పూర్తయిన సందర్భంగా లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. వారి నుంచి పలు సూచనలు స్వీకరించారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం 70 ఏళ్లు వెనక్కి పోయిందని.. భట్టి విమర్శించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని%ూ%ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నామని భట్టి వివరించారు. అధికారంలో వచ్చిన వెంటనే ప్రజావాణి ఏర్పాటు చేశామని.. నిరంతర పర్యవేక్షణతో ప్రజల సమస్యలకు పరిష్కారం చూపుతుందని భట్టి అన్నారు. అదిలాబాద్‌లో పోడు భూముల పట్టాలకు పరిష్కారం తమ ప్రభుత్వం చూపిందన్నారు. అటవీ ప్రాంతాల్లో నివసించే వారికి సోలార్ పవర్ ఇస్తాం అని భట్టి పేర్కొన్నారు. ప్రజల కోసం నిరంతరం తమ ప్రభుత్వం పని చేస్తుందని హామీ ఇచ్చారు. ప్రజా వాణి మొదలై నేటికీ ఏడాది పూర్తయింది. ఏడాది కాలంలో అనేక సమస్యలకు పరిష్కారం చూపిన ప్రజావాణి.. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్లో సమస్యలకు పరిష్కారం చూపింది. ఏ శాఖలో సమస్య ఉన్న ప్రజావాణి పరిష్కారం చూపుతుందన్నారు. ఆరోగ్య సమస్యలకు కూడా ప్రజావాణి ద్వారా సంబధిత హాస్పటల్‌కి పంపి చికిత్స చేసుకోవచ్చన్నారు.

## కాంగ్రెస్ వాళ్లు తెలంగాణ ద్రోహులు

**తెలంగాణ సంస్కృతిపై మరోసారి దాడి చేసే ప్రయత్నం**

**విజయోత్సవాల్లో ఎక్కడా తెలంగాణ సంస్కృతి కనిపించలేదు**

**మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి విమర్శ**



హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తెలంగాణ సంస్కృతిపై మరోసారి దాడి చేసే ప్రయత్నం జరుగుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి విమర్శించారు. నిన్న విజయోత్సవాల్లో తెలంగాణ సంస్కృతి కనిపించలేదన్నారు. నిన్న కనీసం ఏ ఒక్కరిలోనైనా ఉద్యమ భావోద్వేగాలు కనిపించాయా? ఈ సంబరాల్లో ఎవరైనా జై తెలంగాణ అని నినదించారా? అని ప్రశ్నించారు. ద్రోహుల చెంత చేరి తెలంగాణ తల్లికి మోసం చేయవద్దన్నారు. పార్టీ గుర్తు ప్రచారం కోసం కాంగ్రెస్ తల్లిని ఆవిష్కరించారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ వాళ్లు తెలంగాణ ద్రోహులు... తల్లి పాలు తాగి రొమ్ము గుద్దడమనే సామెతకు వారసులని జగదీశ్ రెడ్డి విమర్శించారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ సందర్భంగా అక్కడ పెట్టిన పాట ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ వారిని నిలువెత్తున చీల్చినా... వారి రక్తంలో ఎక్కడా తెలంగాణ ఆత్మ కనిపించదన్నారు.తెలంగాణ చరిత్రను పాతాళానికి తొక్కేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ యాసను విలన్ భాషలా... 'తెలంగాణ' అంటేనే అసహ్యించుకునే ఒక పదంలా, శాసనసభలో 'తెలంగాణ' అనే మాటనే నిషేధించే స్థాయికి వెళ్లారని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. అప్పట్లో ఏదో మత్తులో పడి తెలంగాణను ఏపీలో కలిపారని, ఇప్పుడు కూడా వనరులను దోచుకునే మత్తులో పడి తెలంగాణను నామరూపాలు లేకుండా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాన్నారు.

## ఈనెల 17న తెలంగాణలో రాష్ట్రపతి పర్యటన



హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): ఈ నెల 17 నుంచి తెలంగాణలో రాష్ట్రపతి పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. హైదరాబాద్ పర్యటనలో భాగంగా ఈ నెల 17 నుంచి 21 వరకు రాష్ట్రపతి హైదరాబాద్‌లో ఉంటారని సీఎస్ తెలిపారు. రాష్ట్రపతి పర్యటనను సంతృప్తికరంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. తగిన రీతిలో విస్తృత ఏర్పాట్లు చేయాలని అధికారులను శాంతికుమారి ఆదేశించారు. పాములు పట్టేవారిని నియమించి పాము పట్టే పనిని ముందుగానే పూర్తి చేయాలని అటవీశాఖ అధికారులకు సూచించారు. రాష్ట్రపతి నిలయంలో 24 గంటలూ పాములు పట్టే బృందాన్ని ఏర్పాటు చేయాలని సీఎస్ ఆదేశించారు. అలాగే, %+ఎవీజ% సమన్వయంతో %ౡా% నిలయం పరిసరాల్లో కోతుల బెడదను ఎదుర్కొనేందుకు ప్రత్యేక బృందాలను నియమించాలన్నారు. తేనెటీగలను పట్టుకోవడం ముందుగానే జరిగేలా చూడాలని %+ఎవీజ% అధికారులను ఆదేశించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రాష్ట్రపతి నిలయం సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని, జారీ చేసినవన్నీ ముందుగానే పరిష్కరించేలా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. పోలీసు శాఖ తగిన భద్రతా ఏర్పాట్లు, సరైన ట్రాఫిక్, బందోబస్త్ ప్రణాళికను రూపొందించాలని సూచించారు. అగ్నిమాపక శాఖ అవసరమైన సిబ్బందితో ఫైర్ టెండర్లను ఏర్పాటు చేయాలని కోరారు. వైద్యారోగ్యశాఖ సహాయక సిబ్బందితోపాటు అర్హులైన వైద్యుల సేవలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అవసరమైన బారికేడ్లు, ఇతర ఏర్పాట్లు చేయాలని %= ఽ డీ% శాఖను ఆదేశించారు. రాష్ట్రపతి బస చేసే ప్రదేశం పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని %హేూఖ% శాఖను ఆదేశించారు. అన్ని వేదికల వద్ద అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని ఇంధన శాఖకు చెప్పారు.

## కేటీఆర్ ఇప్పుడు ఒక ఎమ్మెల్యే మాత్రమే

**కేటీఆర్, కవితకు కుక్క కూడా ఓటు వేయదు**

**బీజేపీ ఎంపీ అర్వింద్ తీవ్రవ్యాఖ్యలు**



హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై బీజేపీ నేత, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈరోజు ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ... కేటీఆర్, కవితలకు వచ్చే ఎన్నికల్లో కుక్క కూడా ఓటు వేయదని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ ఇప్పుడు ఒక ఎమ్మెల్యే మాత్రమేనని గుర్తుంచుకోవాలని సూచించారు. తాను ఎప్పుడూ ఫైర్ బ్రాండ్‌నే అని మీడియా ప్రతినిధులు అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. నా బండి నా చేతిలోనే ఉందని... సమయాన్ని బట్టి తాను గేర్ మారుస్తానని, అప్పుడే స్పీడ్ మారుతుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో తెలంగాణ తల్లి విగ్రహం పేరుతో పిచ్చి రాజకీయం చేస్తున్నారని దుయ్యబట్టారు.

## కరోనా మహమ్మారి కనీవినీ ఎరగని విపత్తు

**కొవిడ్ వ్యాక్సిన్ ప్రజల ప్రాణాలను కాపాడింది**

**సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం**

**వ్యాక్సిన్ వల్ల తమ పిల్లలు మృతి చెందారంటూ పిటిషన్**

న్యూఢిల్లీ, (క్రైమ్ మిర్రర్): కరోనా సమయంలో కొవిడ్ వ్యాక్సిన్ ప్రజల ప్రాణాలను కాపాడిందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఈ మేరకు సుప్రీంకోర్టుకు తెలిపింది. కరోనా వ్యాక్సిన్ కారణంగా తమ పిల్లలు మృతి చెందారంటూ ఇద్దరు మహిళల తల్లిదండ్రులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పీవీ వరాలేతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ జరిపింది. కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటీ వాదనలు వినిపించారు. కొవిడ్-19 మహమ్మారి కనీవినీ ఎరగని విపత్తు అన్నారు. వ్యాక్సిన్ పంపిణీ కారణంగా ప్రజల ప్రాణాలు నిలబడ్డాయన్నారు. వ్యాక్సినేషన్, దాని దుష్ప్రభావాల అంశాన్ని సుప్రీంకోర్టు ఇప్పటికే సమగ్రంగా పరిశీలించిందన్నారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ... వ్యాక్సిన్ విషయంలో ఎలాంటి వివాదం లేదని, కానీ ఆ వ్యాక్సినేషన్ తర్వాతే వారు చనిపోయారని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. వీరి మృతిపై నిపుణులతో కూడిన వైద్య బృందాన్ని ఏర్పాటు చేయడం, పోస్టుమార్టం నివేదికను ఇవ్వడం, నిర్దేశించిన కాల వ్యవధిలో దర్యాప్తు పూర్తి చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోర్టును కోరారు. ఇరువురి వాదనలు విన్నసుప్రీంకోర్టు పిటిషన్‌ను విచారణకు స్వీకరిస్తున్నట్లు తెలిపింది.

# తెలంగాణ నేతన్నలకు శుభవార్త

## త్వరలోనే చేనేత రుణమాఫీ

## మంత్రి తుమ్మల కీలక ప్రకటన



హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని వ్యవసాయ, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇప్పటికే రూ.2 లక్షల రైతు రుణమాఫీ అమలు చేసినట్లు చెప్పారు. మొత్తం 4 విడతల్లో దాదాపు 25 లక్షల రైతుల అకౌంట్లలో రూ.22 వేల కోట్ల నగదు జమ చేసినట్లు చెప్పారు. తాజాగా... తెలంగాణలోని నేతన్నలకు సైతం మంత్రి శుభవార్త చెప్పారు. రాష్ట్రంలో చేనేత రంగం సమగ్రాభివృద్ధికి రూ.238 కోట్లతో చేనేత అభయహస్తం పథకాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. అన్నదాతల మాదిరిగానే చేనేత కార్మికులకూ రుణమాఫీకి ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించామన్నారు. ఆర్థిక శాఖ నుంచి ఆమోదం రాగానే చేనేత రుణమాఫీ అమలుచేస్తామన్నారు. ' చేనేత కార్మికులకు నిరంతర ఉపాధి కల్పనకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. అన్ని ప్రభుత్వశాఖలు తమ అవసరాల కోసం చేనేత వస్త్రాలను టెస్కో ద్వారానే కొనుగోలు చేయాలి. ప్రైవేటుసంస్థల వద్ద కొనుగోలు చేస్తే కఠినచర్యలు తీసుకుంటాం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేనేత, జౌళి శాఖకు సంబంధించిన బకాయిలను చెల్లించలేదు. దాంతో ఆ భారం మా ప్రభుత్వంపై పడింది. రాష్ట్రంలోని కార్మికుల సంక్షేమం కోసం బతుకమ్మ చీరలు, ఇతర పథకం కింద రూ.428 కోట్లు విడుదల చేశాం. నేతన్నకు చేయూత పథకం కింద మరో రూ.290.09 కోట్ల బకాయిలు విడుదల చేశాం. మరమగ్గాల పథకం కింద చేనేతలను ఆదుకునేందుకు రూ.5.45 కోట్లు, 10 శాతం నూలు సబ్సిడీ కింద మరో రూ.37.49 కోట్లు, పావలావడ్డీ కింద రూ.1.09 కోట్లు చేనేతల సంక్షేమానికి విడుదల చేశాం.' అని మంత్రి తుమ్మల వెల్లడించారు. చేనేత కార్మికుల ఉపాధి కోసం.. ప్రతి ఏడాది 64.70 లక్షల మంది స్వయంసహాయక సంఘాల మహిళలకు రెండు చొప్పున ఏకరూప చీరల పంపిణీ పథకాన్ని చేపట్టనున్నట్లు చెప్పారు. జాతీయ చేనేత సాంకేతిక సంస్థ కి త్వరలోనే శాశ్వత క్యాంపస్ నిర్మాణాన్ని ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. చేనేతలను ఆదుకుంటూమని.. వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి తుమ్మల వెల్లడించారు.

## మీ పనైపోయింది బిడ్డా ..

**అధికారంలోకి వస్తామని బీఆర్ఎస్ నేతలు కలలు కంటున్నారు**

**బీఆర్ఎస్ నేతలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డ యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**తెలంగాణ తల్లి విగ్రహంపై అధికార-విపక్షాల మధ్య మాటల యుద్ధం**



హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): తెలంగాణ తల్లి విగ్రహంపై అధికార-విపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. బీఆర్ఎస్ నేతలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి. మీరు అధికారంలోకి వస్తామని కలలు కంటున్నారని, మీ పనైపోయింది బిడ్డా తనదైన శైలిలో వ్యాఖ్యానించారు. రాజకీయం కోసం బీఆర్ఎస్ దిగజారి మాట్లాడుతోందని ఆరోపించారు యెన్నం శ్రీనివాస్ రెడ్డి. ముఖ్యంగా కవిత, కేటీఆర్ మరింత దిగజారి మాట్లాడుతున్నారని విమర్శలు గుప్పించారు. చట్టసభల ద్వారా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేశామని, విగ్రహం టచ్ చేసి చూడండంటూ కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావుకు ఛాలెంజ్ విసిరారు. తెలంగాణ తల్లి విగ్రహం ఇప్పుడు తెలంగాణ ప్రజల సొంతమన్నారు. తెలంగాణ తల్లి ఆవిష్కరణ జరిగి ప్రజలు సంతోషంగా ఉన్నారని, తెలంగాణ తల్లికి మట్టి గాజులే ఉంటాయి, ఆభరణాలు ఉండవన్నారు. కవిత మాటలు మరోలా ఉన్నాయన్నారు. అందుకే తెలంగాణ తల్లిలో బీదరికం కనిపిస్తోందన్నారు.కేసీఆర్ ఆనాడు ఏర్పాటు చేసిన విగ్రహం కేవలం శ్రామికవర్గానికి సంబంధం లేకుండా ఉందంటూ అభ్యంతరాలు వచ్చాయన్నారు. తెలంగాణ తల్లి విగ్రహం విషయంలో కేసీఆర్ అధికారికంగా జీవోలు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పదేళ్లలో అసెంబ్లీ అంటే ఫామ్‌హౌస్, సెక్రటేరియేట్ అంటే ప్రగతి భవన్‌గా భావించిందన్నారు.

## చెరువులను కబ్జా చేసి నిర్మాణాలు

**ప్రభుత్వం స్పందించకుంటే కోర్టును ఆశ్రయిస్తా**

**ఐదు కంపెనీలపై హైడ్రా కమిషనర్‌కు కాటిపల్లి ఫిర్యాదు**



హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఈరోజు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను హైదరాబాద్‌లోని బుద్ధ భవన్‌లో కలిశారు. చెరువులను కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్న పలు కంపెనీలపై ఆయన ఫిర్యాదు చేశారు. ఆయా కంపెనీల పేర్లు ఏమిటో కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ... ఈ అక్రమ నిర్మాణానికి సంబంధించి రెండు నెలల క్రితమే తాను మాట్లాడానని వెల్లడించారు. దీనిపై ప్రభుత్వం ఇప్పటికీ స్పందించకుంటే కోర్టును ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు. రెండు నెలల క్రితం తాను మాట్లాడానని, ఆ తర్వాత పది రోజులకు... అనుమతులు ఇచ్చిన నిర్మాణాల జోలికి వెళ్లబోమని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన చేశారని గుర్తు చేశారు.కానీ చెరువులను కబ్జా చేసి అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. తాను ఫిర్యాదు చేసిన ఐదు కంపెనీలకు అనుమతులు ఇచ్చిన వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అనుమతులకు సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వం... గత ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ కొత్త నాటకానికి తెరలేపిందని విమర్శించారు.అక్రమ నిర్మాణాలు చేపడుతున్న ఈ ఐదు సంస్థలకు సంబంధించి అనుమతులిచ్చిన అధికారులు, అండగా ఉన్న ప్రభుత్వ పెద్దలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భూఆక్రమణలను అరికట్టేందుకు కొత్త చట్టాన్ని తీసుకురావాల్సి ఉందన్నారు.

## గ్రూప్ 2 పరీక్షలు యథాతథం

**వాయిదాకు హైకోర్టు నిరాకరణ**



హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): తెలంగాణ గ్రూప్ 2 పరీక్షలు మరో నాలుగు రోజుల్లో జరగనున్నాయి. ఈ క్రమంలో ఇప్పటికే హాల్ టికెట్లు కూడా టీజీపీఎస్సీ విడుదల చేసింది. అయితే గ్రూప్ 2 పరీక్ష వాయిదా వేయాలని కోరుతూ కొందరు అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. వీటిని సోమవారం విచారించిన హైకోర్టు వాయిదాను తిరస్కరించింది. డిసెంబరు 15, 16 తేదీల్లో జరగనున్న పరీక్షలకు ఇప్పటికే ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని, ఈ పరిస్థితుల్లో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. కాగా డిసెంబరు 16న రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు (ఆర్ఆర్‌బీ) పరీక్షలున్నందున గ్రూప్ 2ను వాయిదా వేయాలని కోరుతూ టీజీపీఎస్సీకి ఇచ్చిన వినతిపత్రంపై స్పందించకపోవడాన్ని సవాలు చేస్తూ ఆర్.జ్యోతి అనే అభ్యర్థితోపాటు వివిధ జిల్లాలకు చెందిన సుమారు 22 మంది అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ పుల్లా కార్తీక్ ఇరు పక్షాల వాదనలు విన్నారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ డిసెంబర్ 16న గ్రూప్ 2 కి సంబంధించిన పేపర్ 3, 4 పరీక్షలు ఉన్నాయని, అదేరోజు ఆర్ఆర్‌బీ పరీక్ష కూడా ఉందని అన్నారు. రెండింటికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఒక పరీక్ష రాస్తే మరో పరీక్షను కోల్పోవల్సి వస్తుందని, అందువల్ల గ్రూప్ 2 పరీక్షలను రీషెడ్యూల్ చేయమని కోరుతూ టీజీపీఎస్సీకి నవంబరు 25న వినతిపత్రం ఇచ్చినా పట్టించుకోలేదన్నారు.ఇక మరోవైపు టీజీపీఎస్సీ తరఫు న్యాయవాది రాజశేఖర్ వాదనలు వినిపిస్తూ.. 783 పోస్టులకు 5.51 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని, ఇప్పటికే హాల్‌టికెట్లు కూడా డౌన్‌లోడ్ చేసుకున్నారని తెలిపారు. పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయన్నారు. కేవలం 22 మంది కోసం పరీక్ష వాయిదా వేస్తే కొందరికే ప్రయోజనం ఉంటుందని, మిగతా లక్షల మంది అభ్యర్థులు నష్టపోయే అవకాశం ఉందని పేర్కొన్నారు.

## సిద్దిపేటలో తిరుమల శ్రీవారి ఆలయం నిర్మించండి

**టీటీడీ ఛైర్మన్‌కు హరీష్‌రావు వినతి**

హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): తెలుగు ప్రజలంతా కలియుగ ప్రత్యక్ష దైవంగా కొలిచే తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం.. త్వరలోనే సిద్దిపేట లో కొలువు దీరనుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు తెలిపారు. మంగళవారం (డిసెంబర్ 09న) తిరుపతి వెళ్లిన హరీశ్ రావు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడిని కలిశారు. సిద్దిపేట పట్టణంలోని కోమటి చెరువు ప్రాంతంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర దేవాలయ నిర్మాణం చేపట్టాలని కోరారు. వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం కోసం కోమటి చెరువు ప్రాంతంలో ఇప్పటికే.. 5 ఎకరాల 10 గుంటల స్థలాన్ని మంజూరు చేశామని టీటీడీ ఛైర్మన్‌తో హరీశ్‌రావు తెలిపారు. గతంలోనే టీటీడీకి చెందిన ఇంజనీరింగ్ అధికారులు కోమటి చెరువు ప్రాంతంలో పర్యటించి ఆలయ నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారని బీఆర్ నాయుడికి తెలిపారు. అందులు అనుగుణంగానే ఆలయ నిర్మాణ నమూనా, డిజైన్లను కూడా రూపొందించారని వివరించారు.

## ఎడిటోరియల్



# 30 ఏళ్లలో 4 లక్షల రైతు ఆత్మహత్యలు

**సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ ఇటీవల సమర్పించిన మధ్యంతర నివేదిక దేశం లో నెలకొన్న వ్యవసాయ సంక్షోభాన్ని కళ్ళకు కట్టినట్టు చూపింది. సమస్యల వలయంలో చిక్కుకు న్న అన్నదాతలు, వ్యవసాయ కార్మికులు ఆత్మహత్యల బాట పడుతున్న తీరును ఈ నివేదిక సోదా హరణంగా వివరించింది. అన్నదాతలే గోసతీస్తుంటే వారి మీద ఆధారపడ్డ వ్యవసాయ కార్మికుల కుటుంబాల పరిస్థితి ఎలా బావుంటుందని ప్రశ్నించింది.**

దేశ వ్యాప్తంగా రైతులు, వ్యవసాయ కార్మి కుల బలవన్మరణాలు పెరిగిపోతుండటానికి ఇదొక ముఖ్య కారణమని ఆ నివేదిక కుండ బద్దలు కొట్టింది. ఈ పరిస్థితిని తక్షణమే మార్చాలని పేర్కొనడంతో పాటు, దానికి అవసరమైన కనీస చర్యలనూ సూచించింది. కనీస మద్దతు ధరకు చట్టబద్దత కల్పించడంతో పాటు, దేశ వ్యాప్తంగా తక్షణమే రైతులకు రుణమాఫీ అమలు చేయడం ఈ కమిటీ చేసిన సూచనల్లో అత్యంత కీలకమైనవి. వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థను మెరుగుపరచడం, సేంద్రీయ వ్యవసాయాన్ని, పంటల వైవిధ్యీకరణను ప్రోత్సహించడంతో పాటు వ్యవసాయ కార్మికుల పరిస్థితిని మెరుగుపరిచేందుకు ఉపాధిహామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని చెప్పింది. ఇంత కీలకమైన ఈ సిఫార్సులకు మీడియాలో పెద్దగా ప్రాధాన్యత లభించకపోవడం ఆశ్చర్యకరమైన విషయం. గత నెల రెండవ తేదీన పంజాబ్-హర్యానా హైకోర్టుకు చెందిన రిటైర్డ్ న్యాయమూర్తి నవాబ్‌సింగ్ అధ్యక్షతన ఈ ఉన్నత స్థాయి కమిటీని సుప్రీంకోర్టు ఏర్పాటు చేసింది. వ్యవసాయ రంగాన్ని అధ్యయనం చేసి సాధ్యమైనంత త్వరగా నివేదికను సమర్పించాలని ఈ కమిటీని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. సుప్రీం ఆదేశాల మేరకు పక్షం రోజుల్లోనే ప్రాథమిక పరిశీలనను పూర్తిచేసిన ఈ కమిటీ నవంబర్ 21వ తేదీన మధ్యంతర నివేదికను సమర్పించింది. వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖలకు చెందిన మూడు దశాబ్దాల దేశ వ్యాప్త నివేదికలు, గణాంకాలను ఈ కమిటీ పరిశీలించింది. పంజాబ్-హర్యానా రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి రూపొందించిన ఈ నివేదికలో అనేక షాకింగ్ విషయాలను పేర్కొంది. ముప్పయి సంవత్సరాలలో దేశ వ్యాప్తంగా నాలుగు లక్షల మంది రైతులు, వ్యవసాయ కార్మికులు ఆత్మహత్య చేసుకున్నట్లు ఈ కమిటీ తేల్చింది. నేషనల్ క్రైమ్ రికార్డు బ్యూరో డేటా ఆధారంగా ఈ నిర్ధారణకు కమిటీ వచ్చింది. ఇవి అధికారిక లెక్కలే కావడంతో వాస్తవంలో ఈ బలవన్మరణాలు మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. వ్యవసాయం మీదనే ఆధారపడిన రైతులు రోజుకు 27 రూపాయలు మాత్రమే సంపాదిస్తున్నట్లు కమిటీ తేల్చింది. జాతీయ సర్వేతో పాటు నాబార్డు నివేదికలు, గ్రామీణ భారతంలోని వ్యవసాయ కమతాలు, పశుసంపదకు సంబంధించిన కేంద్ర ప్రభుత్వ రికార్డులను పరిశీలించి రైతుల ఆదాయంపై ఈ నిర్ధారణకు వచ్చిన కమిటీ 'ఇంత తక్కువ ఆదాయంతో జీవనాన్ని కొనసాగించడం అసాధ్యం. ఇదే వారిని ఆత్మహత్యల వైపు నడిపిస్తోంది' అని పేర్కొంది. దేశ వ్యాప్తంగా ఉన్న మొత్తం కార్మికుల్లో 46 శాతం మంది ఇప్పటికీ వ్యవసాయం మీదనే ఆధారపడి ఉన్నారని, ఆదాయంలో వారి వాటా కేవలం 15 శాతమేనని తెలిపింది. వ్యవసాయ కార్మిక కుటుంబాల్లో నిరుద్యోగులుగా ఉన్న వారు, జీతం లేకుండానే కుటుంబం తరపున రెక్కలు ముక్కలు చేసుకుంటున్న వారి సంఖ్య కూడా గణనీయంగానే ఉందని కమిటీ పేర్కొనడం గమనార్హం. ఇది ఏదో రూపంలో కొనసాగుతున్న వెట్టిచాకిరీకి నిదర్శనం.మ సమస్యల పరిష్కారం కోసం సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతాంగం దేశ వ్యాప్త ఆందోళనకు తిరిగి సిద్ధమౌతున్న నేపథ్యంలో ఈ నివేదిక వెలువడటం ప్రాధాన్యత సంతరించుకుంది. కొన్ని సంవత్సరాలుగా రైతాంగం ఏదైతే చెబుతుందో దాదాపుగా అవే అంశాలు అంతే తీవ్రతతో ఈ నివేదికలోనూ కనిపించడం క్షేత్రస్థాయిలో నెలకొన్న దుస్థితికి దర్పణం పడుతోంది. కేంద్ర ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా తక్షణం రైతుల సమస్యలను పరిష్కరించడంపై దృష్టి సారించాలి. సుప్రీంకోర్టు ఉన్నత స్థాయి కమిటీ సిఫార్సు చేసిన, రైతాంగం ఎప్పటి నుండో డిమాండ్ చేస్తున్న కనీస మద్దతు ధరకు చట్టబద్దత, రుణ మాఫీ వంటి చర్యలకు తక్షణం శ్రీకారం చుట్టాలి.

# కడప ఉక్కు పరిశ్రమతో పాలకుల చెలగాటం

**క**డప ఉక్కు పరిశ్రమ పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చాలా కాలంగా చెలగాటమాడుతున్నాయి. పరిశ్రమ వస్తే ఉద్యోగాలు వస్తాయని, బతుకులు బాగు పడతాయని ఎదురు చూస్తున్నసీమ బిడ్డలఆశలు అడియాసలు అవుతున్నాయి. కడప స్టీల్‌ఎ÷-లాంట్ కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో లేదని గత మంగళవారం లోక్‌సభలో కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామి ప్రకటించారు. ఇప్పటికే విశాఖ ఉక్కు ఉంటుందా, ఊడుతుందా అని ఆందోళనలో ఉన్న రాష్ట్ర ప్రజలకు కేంద్రం చేసిన మరో ద్రోహం ఇది. 20 వేల కోట్ల పెట్టుబడి అంచనాతో 20 లక్షల టన్నుల సామర్థ్యంతో, ప్రత్యక్షంగా 25 వేలు, పరోక్షంగా లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని రాయల సీమ యువతను ఇన్నాళ్ళుగా ఊరించిన పాలకుల నిజ స్వరూపం పార్లమెంట్ సాక్షిగా బయట పడింది. గత పది సంవత్సరాలకు పైగా రాష్ట్ర విభజన హామీలు అమలు చేయకుండా, వెనుకబడిన ప్రాంతాలకు నిధులు ఇవ్వకుండా మోసపూరితంగా వ్యవహరించారు. ప్రస్తుతం కేంద్రంలో తాము అధికారంలో వుండడానికి ఆంధ్ర ప్రజలు తెలుగుదేశం, జనసేన పార్టీలు ఇచ్చిన బలమే ఆధారమనే స్పృహలో ప్రకటించారు. దాదాపు నాలుగున్నర సంవత్సరాలు కేంద్ర బిజెపికి మద్దతుదారుడిగానే కాకుండా, కేంద్ర ప్రభుత్వంలో టిడిపి భాగస్వామిగా వుంది. ఆ కాలంలో కడప ఉక్కు గురించి కేంద్రంతో మాట్లాడి సాధించకుండా లాభదాయకం కాదని సన్నాయి నొక్కులు నొక్కింది. సొంత గనులు

లేకుండా ఉక్కు పరిశ్రమ నిర్మించలేమని మరో వాదన తెచ్చారు. 'సెయిల్' అధ్యయనం పేరుతో కడప ఉక్కు




కూడా కేంద్ర పాలకులు లేరు. ఇందుకు ప్రధాన కారణం మన రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీల వెన్నెముక లేని రాజకీయ వైఖరులే. వ్యక్తిగత, స్వార్థ రాజకీయాల కోసం రాష్ట్ర పాలక, ప్రతిపక్షాల నేతలు కేంద్రం ముందు సాష్టాంగ ప్రణామాలు చేస్తున్నంత కాలం ఆంధ్రకు బిజెపి చేస్తున్న ద్రోహపూరిత వైఖరిలో మార్పు రాదు. కరువుకు కేరాఫ్ అడ్రస్ అయిన సీమలో యువతకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ఉమ్మడి రాష్ట్రంలో నాటి సీఎం వై.ఎస్.రాజశేఖరరెడ్డి కడపలో బ్రహ్మణి ఉక్కు పరిశ్రమను నిర్మించాలని 2007 జూన్ 10న అంబవరం గ్రామ సమీపంలో శంకుస్థాపన చేశారు. రైతుల నుండి ఒక్క ఎకర భూ సేకరణ చేయకుండా అందుబాటులో వున్న 10 వేల ఎకరాల ప్రభుత్వ భూమిలో ఈ పరిశ్రమను నిర్మిస్తున్నామని ప్రకటించారు. పరిశ్రమను నిర్మించే బ్రహ్మణి స్టీల్ కంపెనీకి ఎకరం 18 వేల చొప్పున 10 వేల ఎకరాల భూమి అప్పగించారు. పరిశ్రమ ఒక్క అడుగు ముందుకు పడకపోయినా రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పాలకులు, వారి అనుచరులు వేల కోట్లు దండుకున్నారు. రాజశేఖరరెడ్డి మరణానంతరం రాష్ట్ర విభజన జరిగింది. రాష్ట్ర విభజన వల్ల నష్టపోయే ప్రాంతాల అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టం-2014లో కడపలో ప్రభుత్వ రంగంలోనే భారీ ఉక్కు పరిశ్రమను నిర్మిస్తామని అప్పటి కేంద్ర కాంగ్రెసు ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటి అధికార బిజెపి దానిని బలపరచింది. రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేసిన పదేళ్ళ తర్వాత విభజిత ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా చంద్రబాబు 2018లో ఎన్నికలకు సరిగ్గా ఐదు నెలల ముందు గండికోట రిజర్వాయర్ సమీపంలోని కంబాలదిన్నె గ్రామం వద్ద మరోసారి శంకుస్థాపన చేశారు. రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం ప్రభుత్వమే 4 వేల ఎకరాల్లో ఉక్కు పరిశ్రమను నిర్మిస్తుందని ఆయన వారి బంధం చెడిన తర్వాత అప్పటి తన పార్టీ రాజ్యసభ సభ్యుడు సి.ఎం. రమేష్‌తో 2018 జూన్ 20న కడపలో నిరాహారదీక్ష చేయించి, ప్రభుత్వమే ఉక్కు పరిశ్రమను నిర్మిస్తుందని హామీ ఇచ్చి ఆ దీక్షా నాటకానికి తెర దించారు. ఆ నేపథ్యంలోనే 2018 డిసెంబర్ 27న ఉక్కు పరిశ్రమకు రెండవసారి శంకుస్థాపన జరిగింది. తర్వాత జగన్ మోహన్ రెడ్డి 2019 డిసెంబర్ 23న మూడోసారి శంకుస్థాపన చేశారు. పరిశ్రమ నిర్మాణంలో ప్రభుత్వరతో పాటు ప్రైవేటు భాగస్వామ్యానికి అవకాశం కల్పిస్తూ రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్స్ (ఆర్ఎఫ్‌పి) పద్ధతుల్లో గ్లోబల్ నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ పరిశ్రమకు ప్రతి సంవత్సరానికి రెండు టిఎంసీల నీరు, నాలుగు లైన్ల రోడ్లు, రైలు మార్గం ఏర్పాటు కోసం టెండర్లు పిలిచారు. కాంట్రాక్టర్లకు పని దొరికింది. పాలకులకు కమిషన్లు అందాయి. పరిశ్రమ మాత్రం ఒక్క అడుగు ముందుకు పోలేదు. తిరిగి 2023 ఫిబ్రవరి 15న ఇదే ఉక్కు పరిశ్రమకు మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. నాలుగు సార్లు శంకుస్థాపన చేసినా పని ఒక్క అంగుళం కూడా ముందుకు జరగని ఏకైక పరిశ్రమ బహుశా ఇదేనేమో! వెనుకబడిన ప్రాంతాల గురించి మొసలి కన్నీరు కారుస్తూ రియల్ ఎస్టేట్ వ్యాపారంలో, పరిశ్రమ పేరుతో కాంట్రాక్టు పనుల్లో కమిషన్లలో కోట్లు కొల్లగొట్టడానికి, ఎన్నికల్లో ఓట్లు దండుకోవడానికి శంకుస్థాపనలు చేస్తూ రాయలసీమ ప్రజలను పాలక పార్టీలు పదేపదే మోసం చేస్తున్నాయి. రాష్ట్ర విభజన చట్టంలో రూపొందించిన అంశాలపై ఆనాడు కేంద్రంలో ప్రతిపక్ష పార్టీగా బీజేపీ నానా రగడ చేసింది. ప్రత్యేక హోదాతో పాటు, కడప ఉక్కు పరిశ్రమ గురించి నాడు తెలుగుదేశం, పవన్, జగన్‌తో కలిసి తిరుపతి సభలో ప్రధానమంత్రి హామీ ఇచ్చారు. ఆ తర్వాత మాటల గారడీకి తెరలేపింది. కడపలో ప్రభుత్వ రంగంలో ఉక్కు పరిశ్రమ నిర్మించడం సాంకేతికంగా, ఆర్థికంగా పరిశ్రమ నష్టాదాయకమని చెప్పారు. ఈ వితండ వాదనలు చేస్తున్న కేంద్ర బిజెపి ని నాటి అధికార తెలుగుదేశం, ప్రతిపక్ష వైసిపి కనీసంగా కూడా ప్రశ్నించలేదు. పార్లమెంట్‌లో నిలదీసి ఉక్కు పరిశ్రమ సాధనకు ఉద్యమం చేయలేదు. కలిసిమెలిసి వున్నకాలం పూర్తయిన తర్వాత తెలుగుదేశం నాయకులు కేంద్రాన్ని విమర్శించడం ప్రారంభించారు. కడపలో ప్రభుత్వ రంగంలో ఉక్కు పరిశ్రమ స్థాపిస్తామని, రాయసీమలో రెండో రాజధాని, కర్నూలులో హైకోర్టు ఏర్పాటు, సాగునీటి ప్రాజెక్టులకు 20 వేల కోట్ల నిధులు అంటూ 16 డిమాండ్లతో కూడిన రాయలసీమ డిక్లరేషన్‌ను బిజెపి 2018 ఫిబ్రవరి 22న కర్నూలులో ప్రకటించింది. దీనికి ప్రతిగా 'ప్రజలను మభ్యపెట్టడంలో దిట్టలు మోడీ, అమిత్‌షాలని టిడిపి ఎంపీ గల్లా జయదేవ్ తీవ్రంగా విమర్శించారు. వెంటనే బిజెపి రాయలసీమ వాదన అందుకుంది.ఞ÷సిపి అధికారంలో వున్నంతకాలం కేంద్ర బిజెపికి పార్లమెంట్‌లో అండగా నిలచింది. వినాశకర బిల్లులు, విధానాలన్నింటినీ బలపరచింది. రాష్ట్రంలో అమలుచేసేందుకు అతి ఉత్సాహాన్ని ప్రదర్శించింది. ఇంతా చేసి కడపకు ఉక్కు పరిశ్రమను మాత్రం సాధించలేకపోయింది. టిడిపి, జనసేన పార్టీలు బిజెపి తో జతకట్టిన వెంటనే కడప ఉక్కు పరిశ్రమ వైసిపి కి గుర్తుకు వచ్చింది. కేంద్రం కడప ఉక్కును అడ్డుకుందని వైసిపి నాయకులు విమర్శించడం ప్రారంభించారు.

ఎన్నికల సందర్భంగా చంద్రబాబు నాయుడు కడప ఉక్కు గురించి హామీ ఇచ్చిన విషయం కడప జిల్లాలో రెండు ఎంఎల్ఏ సీట్లకు పోటీ చేసిన బిజెపికి తెలియదా? అప్పుడు ఉక్కు పరిశ్రమ సాధ్యంకాదని ఎందుకు చెప్పలేదు? రాష్ట్రం కోసం ఎవరినైనా ప్రశ్నిస్తా అని చెప్పిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కడప ఉక్కు లేదని కేంద్రమంత్రి పార్లమెంట్‌లో చెబుతుంటే ఎందుకు కేంద్రాన్ని ప్రశ్నించరు?

## కింగ్‌ఫిషర్ టవర్స్‌లో ఫ్లాట్‌ను కొనుగోలు చేసిన

### ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి




**ఇ**న్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి లగ్జరీ అపార్ట్‌మెంట్‌ను కొనుగోలు చేసినట్లు తెలిసింది. బెంగళూరులోని ప్రఖ్యాత కింగ్‌ఫిషర్ టవర్స్‌లో రూ.50 కోట్లు వెచ్చించి విలాసవంతమైన ఫ్లాట్‌ను కొనుగోలు చేసినట్లు సమాచారం. నివేదికల ప్రకారం.. నాలుగు బెడ్‌రూమ్‌ల ఈ ఫ్లాట్ 8,400 చదరపు అడుగుల విస్తీర్ణంలో 16వ అంతస్తులో ఉంది. మొత్తం ఐదు విలాసవంతమైన కార్లను పార్క్ చేసుకోవచ్చు. ముంబైకి చెందిన ఓ వ్యాపారవేత్త నుంచి ఈ ఫ్లాట్‌ను మూర్తి కొనుగోలు చేశారు. కాగా, నాలుగేళ్ల క్రితం నారాయణమూర్తి భార్య సుధామూర్తి అదే కాంప్లెక్స్‌లోని 23వ అంతస్తులో రూ.29 కోట్లతో ఫ్లాట్‌ను కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. కింగ్‌ఫిషర్ టవర్స్ బెంగళూరు నడిబొడ్డున యూబీ సిటీలో ఉంది. ఇది కింగ్ ఫిషర్ అధినేత విజయ్ మాల్యా పూర్వీకుల ఇళ్లు ఉన్న స్థలం. దాదాపు 4.5 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ స్థలాన్ని విజయ్ మాల్యా-ప్రెస్టీజ్ గ్రూప్ రెండు కలిసి అభివృద్ధి చేశాయి. 34 అంతస్తుల కింగ్‌ఫిషర్ టవర్స్‌లో మూడు బ్లాకులు ఉన్నాయి. వీటిలో 81 అల్ట్రా-లగ్జరీ అపార్ట్‌మెంట్‌లు ఒక్కొక్కటి 8,000 చదరపు అడుగుల విస్తీర్ణం కంటే ఎక్కువ స్థలంలో ఉన్నాయి. 2010లో ప్రాజెక్ట్ మొదటిసారి ప్రారంభించబడినప్పుడు, ఫ్లాట్‌లు చదరపు అడుగులకు రూ.22,000 చొప్పున అమ్ముడయ్యాయి. ప్రస్తుతం మూర్తి చదరపు అడుగు రూ.59,500తో కొనుగోలు చేసినట్లు తెలిసింది.

# తెలంగాణ పల్లెల్లో ఇంటర్నెట్ విప్లవం..

**ప**ల్లెలే దేశాభివృద్ధి సూచికలు. ఒక దేశం పురోగతిని గ్రామీణ ప్రాంతల్లో ప్రజల జీవన పరిస్థితులు నిర్వచిస్తాయి. తెలంగాణ ఏర్పాటు తరువాత రాష్ట్రం రాష్ట్రం అనేక రకాలుగా ప్రగతి సాధించింది అనేది నిజం. రోడ్లు, తాగునీరు, పారిశు ద్ధ్యం, మౌళిక సదుపాయాల కల్పన రంగాలలో మార్పు స్పష్టంగా కనిపిస్తుంది. రేవంత్ రెడ్డి సర్కార్ దీనిని ముందుకు తీసుకువెళుతోంది. ఈ క్రమంలో తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ విప్లవాన్ని తీసుకురాబోతోంది. ప్రతి ఇల్లు ఇక ఇంటర్నెట్

సౌకర్యాన్ని పొందనుంది.రూ.300కే ఇంటర్‌నెట్ కనెక్షన్ అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నాయి. రాష్ట్రంలోని లక్షల ఇళ్లకు దశలవారీగా ప్రభుత్వం ఈ సౌకర్యం కల్పించనుంది. ఇది వై÷ కనెక్షన్ లాంటిది. ఈ కనెక్షన్ తీసుకుంటే వర్చువల్ నెట్‌వర్క్‌తో పాటు టెలిఫోన్, పలు తెలుగు ఓటీటీలను గ్రామీణ ప్రజలు చూడటానికి వీలుపడుతుంది. మొదటి దశలో నారాయణపేట, సంగారెడ్డి, పెద్దపల్లి జిల్లాల్లోని 2,096 పంచాయతీల్లో అమలు చేయనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం దీనిని ప్రారంభిస్తారు. తరువాత మిగిలిన గ్రామాల్లో ఏర్పాట్లు పూర్తిచేయనున్నారు. దేశంలోని అన్ని గ్రామాలకు ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించే లక్ష్యంతో భారత్ నెట్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఒక పథకాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా రాష్ట్రానికి రూ.2,500 కోట్లు కేటాయించింది. ఈ పథకం కింద గ్రామాల్లో ప్రతి ఇంటికి అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించేందుకు ఫైబర్ నెట్ కనెక్షన్‌ను అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ వ్యవస్థ ఏర్పాటు బాధ్యతను టీ ఫైబర్ సంస్థ తీసుకుంది. ప్రతి ఇంటికి రూ.300కే ఇంటర్‌నెట్ కనెక్షన్ ఇవ్వాలని ప్రాథమికంగా నిర్ణయించారు. దీన్ని ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. ఈ కనెక్షన్ తీసుకుంటే ప్రతి ఇంట్లో ఉన్న టీవీనే కంప్యూటర్‌గా మారుతుందని అధికారులు చెబుతున్నారు. 20 ఎంబీపీఎస్ స్పీడ్‌తో కనెక్షన్ ఇస్తారు. ఈ కనెక్షన్ ద్వారా చెల్లింపులు కూడా చేయవచ్చు. గ్రామంలోని అన్ని కార్యాలయాలకు, స్కూళ్లకు కూడా కనెక్షన్ ఇవ్వనున్నారు. టీవీనే కంప్యూటర్‌గా మారుతుంది కాబట్టి విద్యార్థులకు ఎంతో ఉపయోగపడే అవకాశముంది. ఈ కనెక్షన్ తీసుకునేవారితో హైదరాబాద్ నుంచి సీఎం నేరుగా మాట్లాడే వీలు కలుగుతుందని అధికారులు తెలిపారు.

ప్రతి గ్రామంలోనూ జంక్షన్లు, ఇతర చోట్ల కూడా అత్యాధునిక సీసీ కెమెరాలను ఏర్పాటుచేసి ÷బైర్‌నెట్‌తో అనుసంధానం చేయబోతున్నారు. ఇవి ప్రతి పోలీసుస్టేషన్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానమవుతాయి. రాష్ట్రంలోని ప్రతి ఇంటికి, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్




అనుసంధానంతో పాటు డిజిటల్ సేవలు అందించడమే టీ-÷బైర్ లక్ష్యం. టీ ఫైబర్ నెట్‌వర్క్ ఆపరేషన్స్ సెంటర్(టీ-ఎన్‌వోసీ) నుంచి ఈ వ్యవస్థను పర్యవేక్షిస్తున్నాం. 94 మండలాలు, 2,096 గ్రామ పంచాయతీల్లో కమర్షియల్ సేవలు అందించేందుకు వీలుగా పనులు పూర్తయ్యాయి. ఈ ప్రాజెక్టు తొలిదశలో 30 వేల ప్రభుత్వ సంస్థలను అనుసంధానించేందుకు ప్రణాళికలు చేశాం. ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్(పీవోసీ)లో భాగంగా తొలిదశలో మద్దూరు, సంగుపేట్, అడవి శ్రీరామ్‌పూర్ గ్రామాల్లో టీ÷బైర్ ట్రయల్ సేవలను ఈనెల 8న సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారు. నిజానికి, ఈ స్కీంకు సంబంధించి గత సెప్టెంబర్ నుంచే రేవంత్ సర్కార్ కసరత్తు చేస్తోంది.

# మానవహక్కుల పరిరక్షణ కొరకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

## రెవెన్యూ డివిజనల్ అధికారి- కృష్ణా రెడ్డి

**హ్యూమన్ రైట్స్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు -ఇంతియాజ్ అహ్మద్**




**భువనగిరి, డిసెంబర్ 10(క్రైమ్ మిర్రర్):** మానవహక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి,నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ జస్టిస్ కమీషన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు ఎండీ ఇంతియాజ్ లు పిలుపునిచ్చారు. భువనగిరి జిల్లా కేంద్రంలోని జాగృతి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో నేషనల్ హ్యూమన్ రైట్స్ జస్టిస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మానవ హక్కుల,దినోత్సవం ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం లోని ప్రాథమిక హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తూనే, బాధ్యతలను కూడా గుర్తించి మెలగాలని,వారు కోరారు.గత దశాబ్ద కాలంగా దేశంలో రాష్ట్రంలో,మానవ హక్కుల ఉల్లంఘనలు అనేకం జరిగాయని,పౌర హక్కుల నాయకులను,ప్రజా సంఘాల నాయకులను నిర్బంధాలకు గురిచేసి,జైల్లో పెట్టారని వారన్నారు.ముఖ్యంగా రాష్ట్రంలో,జరిగిన మానవ హక్కుల ఉల్లంఘనలు సభ్య సమాజానికి సిగ్గు చేటని వారన్నారు.రాష్ట్ర ప్రభుత్వం మానవ హక్కుల పరిరక్షణ కోసం కృషి చేయాలని మహిళలకు రక్షణ కల్పించాలని ఆయన కోరారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన ఆర్డీఓ కృష్ణ రెడ్డి మాట్లాడుతూ ప్రజా స్వామ్య దేశం లో హక్కులకు భంగం జరగకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతుందని అన్నారు.తమ హక్కులకు భంగం కలిగినప్పుడు ధైర్యం గా ప్రభుత్వ అధికారులకు గాని హ్యూమన్ రైట్స్ వారికి గాని, పోలీసు శాఖ వారికి గాని సమాచారం అందించాలని అన్నారు.విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని ఏర్పరచుకోవాలని అన్నారు.అలా ప్రశ్నించడం వలన మన హక్కులను మనం కాపాడుకోగలుగుతామని అన్నారు.అలాగే సమాజం లో కాని మన చుట్టు పక్కల జరిగే అన్యాయాలపై అక్రమాలపై నిలదీసి ధైర్యం గా అడ్డుకోవాలని పిలుపు నిచ్చారు.అలాగే ప్రభుత్వం విద్యార్థుల కొరకు మహిళల కొరకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. డిడబ్ల్యూఓ నర్సింహా రావు మాట్లాడుతూ మహిళలకు,వయో వృద్ధులకు ప్రభుత్వం అనేక రకాల సహాయ సహాకారాలు అందిస్తుందని వాటిని ప్రతి ఒక్కరు తమ హక్కుగా భావించి సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.సబ్ ఇన్స్పెక్టర్ లక్ష్మి నారాయణ మాట్లాడుతూ ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని,చెడు వ్యసనాలకు బారినపడి తమ జీవితాలను నాశనం చేసుకోకూడదని అన్నారు.విద్యార్థినులు తమ ఫొటోస్ ని స్నాప్ చాట్ లో కాని,ఫేస్ బుక్ లో కాని ఇన్స్టాగ్రామ్ లో వేయకూ డదని తెలిపారు.అలా ఫొటోస్ వేయడం వలన హాకింగ్ కు గురి అయ్యి మన జీవితమే నాశనం అవుతుందని అన్నారు.బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కన్వీనర్ కొడారి వెంకటేష్ మాట్లాడుతూ భారత రాజ్యంగం మనకు కొన్ని హక్కులు కల్పించడం జరిగిందని వాటిని మనం సక్రమంగా కాపాడుకొని జీవితం లో ముందుకు వెళ్లాలని సూచించారు.

**కళాశాల వైస్ ప్రిన్సిపాల్**

మణిపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు బాగ చదువుకొని ఉన్నతమైన ఉద్యోగాల్లో స్థిర పడాలని మానవ హక్కులను ప్రతి ఒక్కరు తెలుసుకొని జీవితం లో ముందుకు సాగి తమ హక్కులను కాపాడుకోవాలని అన్నారు. అనంతరం మహాత్మా గాంధీ యూనివర్సిటీ టాపర్ గా,నిలిచిన విద్యార్థిని సైఫా నాజ్ ను, కళాశాల టాపర్ గా నిలిచిన సమీనా,కీర్తన,రజిని భావన, అనే విద్యార్థులను శాలువాతో సత్కరించి మెమోంటో లు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో మైనారిటీ జర్నలిస్ట్ ఫెడరేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇస్తియాక్ అహ్మద్, కళాకారుడు గడ్డం సత్య నారాయణ,కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మణిపాల్ రెడ్డి,విద్యార్థులు విజయ్ మౌనిక,ప్రియా,మాధురి అనూష రమ్య,విష్ణు శివ ప్రసాద్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మానవ హక్కుల కమిషన్ మరింత సమర్ధవంతంగా పనిచేయాలి

## వైద్యం,విద్యా సమానంగా లభించాలి..!



**మంచిర్యాల ప్రతినిధి(క్రైమ్ మిర్రర్):** విద్యా,వైద్య అవకాశాలు అందరికీ సమానంగా లభించకపోవడం కూడా మానవ హక్కుల ఉల్లంఘనే అని, ప్రజల హక్కుల పరిరక్షణకు మానవ హక్కుల కమిషన్ మరింత సమర్థవంతంగా పని చేయాలని సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ అధ్యక్షుడు, మానవ హక్కుల కార్యకర్త డాక్టర్ రాజలింగు మోతె అన్నారు. మంగళవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా రామకృష్ణ పూర్ పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశం లో ఆయన మాట్లాడారు. మనిషి మనిషిగా జీవించడానికి హక్కులు అత్యంత అవసరమని, కానీ భారతదేశంలో శతాబ్దాలుగా కులం ఆధారంగా మనుషులపై వివక్ష కొనసాగుతుందని ఆయన అన్నారు. ఇప్పటికి కూడా జైల్లో కూడా కులవివక్ష కొనసాగుతుందన్నారు. ఇటీవల ఈ విషయాన్ని సుప్రీంకోర్టు తప్పు పట్టిందన్నారు. ఖైదీల చేతనే మరుగుదొడ్లు కడిగించడం,ట్యాంకులు శుభ్రం చేయించడం వంటి పనులపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిందన్నారు. దీన్ని బట్టి భారతదేశంలో కులం పేరుతో మానవహక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నాయన్నారు. స్త్రీలు,బాలికలు, వృద్ధులపై హింస పెరుగుతున్నాయని అన్నారు. విద్యా,,వైద్య అవకాశాలు అందరికీ సమానంగా లభించక, దేశ సంపద కొందరి చేతుల్లోనే ఉండడం కూడా మానవ హక్కుల ఉల్లంఘనే అని అన్నారు. ప్రభుత్వాలు అందరికీ సమాన అవకాశాలు కల్పించాలని, ప్రజాస్వామిక వాతావరణాన్ని ప్రోత్సహించాలని అన్నారు. అప్పుడే హక్కులు కాపాడబడి ప్రజలు ఆత్మగౌరవంతో జీవించగలరని అన్నారు. కార్యక్రమం లో సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ నాయకులు అడెపు సురెంధర్, కాగితపు సునీల్,నడిపెల్లి సునీల్ రావు,హనుమండ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు ప్రజాభిప్రాయ సేకరణలు చేపడుతున్నాం

**మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ**

**మణికొండలో ట్రాఫిక్ సమస్యపై స్వచ్ఛందంగా ముందుకు వచ్చి అభిప్రాయాలు తెలిపిన ప్రజలు.**

**తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న వాపోతున్న ప్రయాణికులు**

**అధికారులు, ప్రజాప్రతినిధుల్లో మాత్రం చలనం శూన్యం.**



గండిపేట్(క్రైం మిర్రర్): ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ప్రజా సేకరణ కార్యక్రమాలు చేపడుతున్నామని మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ అన్నారు.
మణికొండ భారత రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ప్రజలు తీవ్రంగా ఎదుర్కొంటున్న సమ్సయల్లో ప్రధానంగా ట్రాఫిక్ సమస్య తీవ్రతను అధికారుల దృష్టికి తేవడానికి ప్రజలకు, వాహనాదారులకు వీసమెత్తు ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ సమస్యపై మణికొండ పైపులైన్ రోడ్డులో గల ఫ్రెండ్స్ కాలనీ దిలీప్ సూపర్ మార్కెట్ వద్ద నుంచి మొదలు పెట్టిన ప్రజాభిప్రాయ సేపకరణలో భాగంగా దాదాపు వంద మంది పూరజనులతో సంభాషించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ పైపులైన్ రోడ్డులో ఉన్న వైన్స్ షాపును తక్షణమే తోలగించాలని ఈ రోడ్డులోని డ్రైనేజీ వ్యవస్థను సరిదిద్దాలని, రోడ్డు ట్రాఫిక్‌కు అనుకూలంగా కరెంటు స్తంబాలను ఏర్పాటు చేయాలని, పార్కింగ్‌ను సరిద్దిడడం, ముఖ్య కూడల్లో ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారన్నారు. ఆర్‌టీఏ ఆఫీస్ ప్రాంతంలో ట్రాఫిక్‌ను నియంత్రించడానికి వీధి లైట్లు బిగించాలని డిమాండ్ చేశారు. సమస్యలపై పుర జనులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బీఆర్ఎస్ మర్రిచెట్టు, పంచవటి కాలనీ వరకు కూడలి రోడ్డులో ఉన్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని కోరడమైందన్నారు. ఈ కార్యక్రమంలో కుంబగళ్ల ధనరాజ్, మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి, డాక్టర్ కీర్తి లతా గౌడ్,ముత్తంగి లక్ష్మయ్య, ఏర్పుల శ్రీకాంత్, విఠల్, సంఘం శ్రీనివాస్, మల్యాద్రి నాయుడు, ఉపేంద్రనాథ్‌రెడ్డి, బుద్దోలు బాబు, భానుచందర్, యాలాల కిరణ్, షేక్ ఆరిఫ్, రాజేంద్రప్రసాద్, బొడ్డు శ్రీధర్, విజయలక్ష్మి, దీపక్, సుమ, మంజు, అనుషా, మహేశ్వరం సుమన్, ప్రవీణ్, రాజు, శ్రీనివాసచారి, మహేష్, ఉసేన్ తదితరులు పాల్గొన్నారు.

# విగ్రహాలు మారిస్తే చరిత్ర మారదు ప్రజల బతుకు మారితే తెలంగాణ మారుతుంది

**ఉద్యమ తల్లే మా తల్లి.**

**రాజేంద్రనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి**




**గండిపేట్(క్రైం మిర్రర్):** తెలంగాణతల్లి పేరు చెప్పి..కాంగ్రెస్‌తల్లి పేరుతో ప్రభుత్వం తీరని అపచారం చేశారని రాజేంద్రనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి విమర్శించారు.తెలంగాణ తల్లి విగ్రహం మార్పునకు నిరసనగా రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని డైరీ ఫామ్ చౌరస్తాలో మంగళవారం రాజేంద్రనగర్ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లికి పాలాభిషేకం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి హాజరై ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు.ఈ సందర్భంగా పోరెడ్డి ధర్మారెడ్డి మాట్లాడుతూ...ప్రపంచంలో అందరూ పూలతో దేవుని పూజిస్తే తెలంగాణలో మాత్రమే పూలతో బతుకమ్మను పేర్చి పూజిస్తామన్నారు.బతుకమ్మ ను మాయం చేసి కాంగ్రెస్ గుర్తు పెట్టారని మండిపడ్డారు.దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు తెలంగాణ తల్లిని తీసి..బీద తల్లిని పెట్టామని కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెప్తున్నది ఉద్యమకారులంతా కలిసి ఏర్పాటు చేసుకున్న తెలంగాణ తల్లి విగ్రహాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మార్చింది.జొన్నలు,మక్కలు ఇతర రాష్ట్రాల్లో కూడా పండుతాయి.పూలనే పూజించే గొప్ప సంస్కృతి తెలంగాణది.తెలంగాణ తల్లి చేతి నుంచి బతుకమ్మను తొలగించారు.తెలంగాణ తల్లిని మార్చి కాంగ్రెస్ తల్లిని ఏర్పాటు చేసుకున్నారని చెప్పారు.తెలంగాణ మహిళలు ఎప్పటికీ పేదగానే ఉండాలా అని ప్రశ్నించారు.కాంగ్రెస్ తల్లిని తాము తిరస్కరిస్తున్నామని చెప్పారు.ఉద్యమ తల్లే తమ తల్లి అని,హస్తం గుర్తు తల్లిని ఆమోదించేది లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పిట్టా బెదిరింపులకు భయపడేవారు ఎవరూలేరన్నారు.

ఉద్యమ కాలంలో ఏర్పాటు చేసుకున్న తెలంగాణ తల్లిని మార్చారని విమర్శించారు.విగ్రహం పెట్టామని చెప్పి సామన్య మహిళలకు ఇచ్చిన హామీలు ఎగ్గొడతారా అని నిలదీశారు.కాంగ్రెస్ తల్లిని తాము తిరస్కరిస్తున్నామని చెప్పారు.ఉద్యమ తల్లే మా తల్లి..హస్తం గుర్తు తల్లిని ఆమోదించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమ నాయకులు ప్రీతం రాజ్, నవీన్ కుమార్, కావేలి గూడెం గిరిబాబు నరేష్ ముదిరాజ్, టిఆర్ఎస్వి ప్రెసిడెంట్ గౌతం, నరేందర్ రెడ్డి, అశ్వాక్, సారంగపని, శీను కాకా, ,శివ, ఖాదర్,శ్రీనివాస్, జాన్ పాషా తదితర నాయకులు పాల్గొన్నారు.

# 10 వ తరగతి విద్యార్థులకు నేడు మండల స్థాయి ప్రతిభ పరీక్షలు

**జిల్లా అధ్యక్షులు అద్దంకి సునీల్**




**నల్లగొండ క్రైమ్ మిర్రర్ :** గణిత పితామహుడు శ్రీనివాస రామానుజన్ అయ్యంగార్ జయంతి సందర్భంగా డిసెంబర్ 22న జరుపుకునే జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా బుధవారం 11 వ తేదీన విద్యాశాఖ ,గణిత ఫోరం ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు మండల స్థాయి గణిత ప్రతిభా పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా అధ్యక్షులు అద్దంకి సునీల్ తెలిపారు.ప్రభుత్వ ఉన్నత,జిల్లా పరిషత్,మోడల్ స్కూల్ , కస్తూర్బా గాంధీ విద్యాలయాలు ప్రతి పాఠశాల నుండి తెలుగు మీడియం ముగ్గురు,ఆంగ్లం మీడియం కు ముగ్గురు పరీక్షలో పాల్గొనాలి అని తెలిపారు.ప్రతి మండలం నుండి ముగ్గురు జిల్లా స్థాయికి ఎంపిక కావడం జరుగుతుందని, ఈ ప్రతిభ పరీక్షలో ప్రతి ఒక్కరు పాల్గొనాలి అని తెలిపారు.ప్రధాన కార్యదర్శి కొరివి కృష్ణ పాల్గొన్నారు.

# పేద ప్రజలకు సేవచేయడమే బీర్ల ఫౌండేషన్ లక్ష్యం - బీర్ల ఫౌండేషన్ చైర్ పర్సన్ బీర్ల అనిత



**భువనగిరి, డిసెంబర్ 10(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గంలో బీర్ల ఫౌండేషన్ తో ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే గా ఉన్న అప్పటి ఫౌండేషన్ చైర్మన్ బీర్ల ఐలయ్య అనేక సేవలు చేశారు. ఇప్పుడు బీర్ల ఫౌండేషన్ చైర్ పర్సన్ గా బీర్ల అనిత ఆపదలో ఉన్నవారికి ఆర్థిక సహాయం అందిస్తూ అదేవిధంగా ఉచిత అంబులెన్స్ తో సేవలందిస్తు ఎంతో మంది ప్రాణాలకు ఉపిరిణిస్తున్నారు.నిరుపేద అడబిడ్డ పెళ్లిళ్లకు ఆర్థిక సహాయలు,కానుకలను అందజేస్తూ ఆసరాగా బీర్ల ఫౌండేషన్ చైర్ పర్సన్ బీర్ల అనిత ఉంటున్నారు.మోటకొండూరు మండల చావపూర్ గ్రామానికి చెందిన గంగపురం రేణుక శంకర్ కూతరు వివాహానికి,రాజపేట మండలం చల్లురు గ్రామానికి చెందిన మహమ్మద్ యాకుబి కూతురు వివాహానికి,యాదగిరిగుట్ట న్యూ గుండ్లపల్లికి చెందిన వడ్డేమాన్ భార్గవి,దీపక్ కుమార్ కూతరు వివాహానికి,యాదగిరిపల్లి కి చెందిన సురేష్ గాయపడగా వారి కుటుంబాలకు సహాయం చేసి బీర్ల అనిత అండగా నిలుస్తున్నారు.అదేవిధంగా ఉచిత అంబులెన్స్ సౌకర్యం కోసం 8297107108 నెంబర్ కు కాల్ చేయాలని సూచించారు. పేద ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా బిర్లా ఫౌండేషన్ పని చేస్తుందని తెలిపారు.

# మిర్యాలగూడలో మధ్యాహ్న భోజనం నిర్వహణను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

**క్రైమ్ మిర్రర్,మిర్యాలగూడ:** మిర్యాలగూడ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నిర్వహణను మున్సిపల్ కమిషనర్ ఎండి. యూసుఫ్ మంగళవారం పరిశీలించారు. ఆయన అశోక్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఇస్లాంపుర జిల్లా పరిషత్ ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాల, ఎన్ఎస్పీ క్యాంపు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలను సందర్శించారు. పాఠశాలల్లో వండుతున్న అన్నం, కూరలు నాణ్యతను పరిశీలించిన ఆయన, విద్యార్థులతో కలిసి భోజనం చేస్తూ మేను ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందించాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు.ఈ సందర్భంగా కమిషనర్ యూసుఫ్ మాట్లాడుతూ, “మధ్యాహ్న భోజనం పథకాన్ని విద్యార్థుల ఆరోగ్యానికి అనుగుణంగా కొనసాగించేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలి” అని సూచించారు.కమిషనర్ వెంట టీపీఓ సోమయ్య, శానిటరీ ఇన్స్పెక్టర్ వెంకటరమణ, హెల్త్ అసిస్టెంట్ జాఫర్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.



# దౌల్తాబాద్ గ్రామ పంచాయతి కార్యదర్శి పై అవినీతి ఆరోపణలు

ఇండ్ల నిర్మాణం పరిమిషన్ కొరకు లక్ష రూపాయల డిమాండ్ చేస్తున్న కార్యదర్శి

లక్ష రూపాయలు లంచం ఇస్తే ఆన్లైన్ లొ మార్పులు చేర్పులు చేస్తున్న వైనం

గ్రామ పంచాయతి నిధులు 18 లక్షలు నగదుని ప్రైవేట్ వ్యక్తులు అకౌంట్లోకి దారి మల్లించాదని ఆరోపన

పంచాయతీ కార్యదర్శి పల్లె బాలరాజు పై జిల్లా కలెక్టర్ కి పిర్యాదు చేసి నట్లు వెల్లడి

విలేకరుల సమావేశంలో బిజెపి నాయకుడు బిట్ల మహేష్ ఆరోపణ

**హత్నూర, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి డిసెంబర్ 10 :** సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం దౌల్తాబాద్ గ్రామపంచాయతీ కార్యదర్శి పల్లె బాలరాజ్ చేస్తున్న అవినీతిపై బిజెపి నాయకులు మంగళవారం నాడు ప్రెస్ మీట్ పెట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బిట్ల మహేష్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ, గ్రామ కంఠం పరిధిలో యాజమాన్య ధ్రువపత్రం లేదా ఇంటి నిర్మాణ అనుమతుల కోసం ఎవరైనా గ్రామస్తులు అర్జీ పెట్టుకుంటే గ్రామ కార్య దర్శి పదవిని అడ్డం పెట్టుకొని వ్యాపారంగా మార్చుకుంటున్నాడని ఆయన ఆరోపించాడు. ఇంటి నిర్మాణ అనుమతి కోసం గ్రామస్తులు ఎవరన్నా సంప్రదిస్తే ముందుగ లక్ష రూపాయలకు పైగా డిమాండ్ చేసి తర్వాత ఆన్లైన్లో తమ స్థలం తక్కువ చూపిస్తుందని సాకులు చూపిసురున్నడని చెప్పారు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లలో, రివిజన్ బుక్ లో స్థలం ఎక్కువ ఉన్నా కూడా ఆన్లైన్లో చూపించిన కొలతల ప్రకారమే తాను ఇంటి పర్మిషన్ ఇస్తా అని చెప్పి, ఐదు సంవత్సరాల వరకు ఆన్లైన్లో మార్పులు జరగవు అని ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. తర్వాత ఆయన చెప్పిన అమౌంట్ కి ఒప్పుకుంటే ఆన్లైన్లో మార్పులు, చేర్పులు చేపిస్తున్ననని చెప్పి మార్పులు చేసి మళ్లీ కొత్త పర్మిషన్ ఇస్తున్నాడని తెలిపారు. ఇదే కాకుండా దౌల్తాబాద్ గ్రామపంచాయతీకి సంబంధించి ఇప్పటివరకు దాదాపు 18 లక్షల రూపాయలకు పైగా పంచాయతీ నగదుని వేరు వేరు ప్రైవేట్ వ్యక్తులు అకౌంట్లోకి దారి మల్లించాడని ఆరోపించారు.



కొంతమంది రాజకీయ నాయకులకు అనుకూలంగా, మరియు వారి ప్రోత్బలంతోనే దౌల్తాబాద్ గ్రామం నుంచి ట్రాన్స్ఫర్ అయిపోయిన తర్వాత కూడా మళ్లీ దౌల్తాబాద్ పంచాయతీ కె ట్రాన్స్ఫర్ చేయించుకుని ఈ దందా కొనసాగిస్తున్నాడని విమర్శించారు. పంచాయతీ కార్యదర్శి పల్లె బాలరాజు విషయంలో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కి కూడా పిర్యాదు ఇవ్వడం జరిగిందని తెలిపారు. మరియు దౌల్తాబాద్ గ్రామ బాధితుల పక్షాన భారతీయ జనతా పార్టీ ఎప్పుడు నిలబడుతుందని మహేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పటేల్ శ్రీశైలం , ధనుంజయ్ గౌడ్ , రాజేష్, కుమ్మరి రమేష్ , నాగరత్నం గౌడ్ , కుమార్ తదిరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వాలు మారినప్పుడల్లా తెలంగాణ తల్లిని మార్చడం సిగ్గు చేటు

**మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ**

**కాంగ్రెస్ నిర్ణయాన్ని నిరసిస్తు మణికొండలో తెలంగాణ తల్లికి పాలాభిషేకం.**

**గండిపేట్(క్రైం మిర్రర్):** ప్రభుత్వాలు మారినప్పుడల్లా తెలంగాణ తల్లిని మార్చడం సిగ్గు చేటు అని ఇది కాంగ్రెస్ పార్టీ అవివేకానికి నిదర్శనమని మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ అన్నారు. మణికొండలో తెలంగాణ తల్లికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో నుంచి తెలంగాణ తల్లి విగ్రహం ధగ ధగా మెరిసిపోతూ నిండు ముత్తైదువలా నగలు, కిరీటం ధరించి బతుకమ్మ ఒక చేత, పాడి పంటలు మరో చేత బూని కనిపించేదన్నారు. ఆమె దోరసాని అని గేలి చేస్తూ అసలు తెలంగాణ తల్లే కాదని, ప్రభుత్వాలు మారినప్పుడల్లా తెలంగాణ తల్లి మారుతుందా అనే సందిగ్ధానికి జవాబుగా సాదాసీదాగా కనిపించే హస్తం గుర్తుతో పేదరికాన్ని ప్రతిబింబిస్తూ ఉన్న కొత్త ప్రతిమను అసలు సిసలైన తెలంగాణ తల్లి అని ప్రస్తుత పాలకులు సచివాలయంలో స్థాపన చేసినందుకు నిరసనగా తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కుంబగళ్ల ధనరాజ్, అందె లక్ష్మణ్‌రావు, గుట్టమీది నరేందర్, సంఘం శ్రీకాంత్, విఠల్, ఉపేంద్రనాథ్‌రెడ్డి, బుదోలు బాబు, భానుచందర్, యాలాల కిరణ్, షేక్ ఆరిఫ్, రాజేంద్రప్రసాద్, బొడ్డు శ్రీధర్, విజయలక్ష్మి, మహేశ్వరం సుమన్, ప్రవీణ్, రాజు, శ్రీనివాసచారి, తిరుపతి, మహేష్, హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

## శివరాంపల్లి జెడ్‌పిహెచ్‌ఎస్‌లో ఈ నెల 12న మండల స్థాయి సీఎం కప్ పోటీలు



**గండిపేట్(క్రైం మిర్రర్):** శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీఎం కప్ మండల స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈవో శంకర్ రాథోడ్ పాల్గొన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, యోగా తదితర పోటీలను ఈ నెల 12వ తేదీన మండల స్థాయిలో శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. మరింత సమాచారం కోసం 9440899993లో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె.గాంగ్యానాయక్, జోనల్ ఇన్‌చార్జీ జ్యోతి, బాలస్వామిరెడ్డి, శ్రీరాం, దేవేందర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## మణికొండ మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ అధికారుల తనిఖీలు






గండిపేట్(క్రైం మిర్రర్): మణికొండ మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో మంగళవారం తనిఖీలు చేపట్టారు. డీఈఈ దివ్యజ్యోతి భర్త గతంలో దివ్యజ్యోతి అక్రమంగా లంచాలు తీసుకుంటూ డబ్బులు పోగు చేసిన వీడియోలు వైరల్‌గా మారిన సంగతి తెలిసిందే. ఈ మేరకు గత రెండేళ్ల కాలంలో జరిగిన అక్రమాలపై ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నారు. దివ్యజ్యోతి చేసిన ప్రతి సంతకాల పేపర్ ఫైల్‌ను పరిశీలించడానికి ఏసీబీ అధికారులు తీసుకువెళ్లారు. అలాగే మణికొండ మున్సిపల్ కమీషనర్ ప్రదీప్ కుమార్ ను, ఏఈఈని సైతం విచారించినట్లు తెలుస్తుంది.

# ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం

**మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి**

**గండిపేట్(క్రైం మిర్రర్):** మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారాలు చూపిస్తున్నట్లు మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని లక్ష్మిగూడ రాజీవ్‌గృహకల్ప కాలనీలో స్థానికుల విజ్ఞప్తి మేరకు కాలనీలో నెలకొన్న భూగర్భ డ్రైనేజీ పైపులైన్ వ్యవస్థ పనులు, అపార్ట్‌మెంట్‌లోని నూతన ప్రహారీ గోడ, మౌలిక వసతుల కల్పన కోసం జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి ఆయన విస్తృతంగా పర్యటించారు. అనంతరం బస్తీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కృషి చేస్తానన్నారు. ప్రతి రోజు డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలు పరిశుభ్రంగా ఉండే విధంగా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ప్రజలకు సమస్యలు తలెత్తితే సహించేది లేదన్నారు. ప్రజా సమస్యల శాశ్వత పరిష్కారమే ధ్యేయంగా అహర్నిశలు కృషి చేయడం జరుగుతుందన్నారు. కాలనీల్లో ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తన దష్టికి తీసుకోని వస్తే ప్రజా సమస్యలను పరిష్కసరించడానికి అనునిత్యం సంసిద్ధంగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ రేణుకా, వర్క్ ఇన్‌స్పెక్టర్లు జియా, జీహెచ్‌ఎంసీ ఏఈ,వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, సూపర్‌వైజర్ వినయ్, డివిజన్ అధ్యక్షుడు అడికే



జనార్ధన్, సచిన్ బబ్లూ, తలారి చిన్న, పాండుయాదవ్, అడికే శివ, ఎన్ను శంకర్, నందిని, పూజ, ఎస్ఎఫ్ఏ మహేందర్, స్ట్రీట్ లైట్, సిబ్బంది, బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## 14న జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోండి

**రాజీమార్గమే రాజమార్గం... ఎస్ఐ ఎస్. కృష్ణయ్య**




క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, మాడుగులపల్లి: జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల ఎస్ఐ ఎస్. కృష్ణయ్య పిలుపునిచ్చారు. మంగళవారం నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 14 తారీకు శనివారం రోజున జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నాం కావున మండల ప్రజలకు ఇదొక సువర్ణావకాశం, కోర్టుల్లో ఎప్పటి నుంచో పెండింగులు ఉన్న కేసులను రాజీ చేసుకుని,కొత్త జీవితాన్ని ప్రసాదించేందుకు లోక్ అదాలత్ పనిచేస్తుంది అని తెలిపారు. అధిక సంఖ్యలో క్రిమినల్, సివిల్, బ్యాంకులకు సంబంధించి కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని, రాజీమార్గమే రాజమార్గం అని ఎస్ఐ కృష్ణయ్య సూచించారు.

## 14న లోక్ అదాలత్.. రాజీమార్గమే రాజమార్గం

**వేములపల్లి మండల ప్రజలు సద్వినియోగం చేసుకోండి: ఎస్ఐ డి.వెంకటేశ్వర్లు**



**క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, వేములపల్లి:** జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల ఎస్ఐ డి. వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మంగళవారం నల్గొండ జిల్లా వేములపల్లి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 14 తారీకు శనివారం రోజున జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నాం కావున మండల ప్రజలకు ఇదొక సువర్ణావకాశం, కోర్టుల్లో ఎప్పటి నుంచో పెండింగులు ఉన్న కేసులను రాజీ చేసుకుని,కొత్త జీవితాన్ని ప్రసాదించేందుకు లోక్ అదాలత్ పనిచేస్తుంది అని తెలిపారు. అధిక సంఖ్యలో క్రిమినల్, సివిల్, బ్యాంకులకు సంబంధించి కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని, రాజీమార్గమే రాజమార్గం అని ఎస్ఐ వెంకటేశ్వర్లు సూచించారు.





## నార్సింగిలో పుట్‌పాత్ అక్రమణ తొలగింపు

**రహదారికి ఇరువైపులా 35 అక్రమ కట్టడాలను తొలగించారు**

గండిపేట్(క్రైం మిర్రర్): పుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపార సముదాయాలు నిర్వహిస్తే వాటిపైన కఠిన చర్యలు తీసుకుంటామని నార్సింగి మున్సిపల్ కమీషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, ట్రాఫిక్ సీఐ నిర్జన రెడ్డి, లా అండ్ ఆర్డర్ ఎస్ఐలు, నార్సింగి మున్సిపాలిటీ టిపిఎస్ మణిహారిక, అన్నారు. నార్సింగి ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు, అధికారులు సంయుక్తంగా స్పెషల్ డ్రై వ్ నిర్వహించారు. నార్సింగి ప్రధాన రహదారి ఇరువైపులా పుట్‌పాత్‌లపై వేసిన 35 అక్రమ కట్టడాలను భారీ బందోబస్తు మధ్యకూల్చివేశారు. నార్సింగిలోని రాయల్ ఫంక్షన్ హాల్ నుంచి గండిపేట్ చౌరస్తా వరకు అక్రమంగా వేసిన షెడ్లను నెలమట్టం చేశారు. పుట్‌పాత్‌లు కబ్జా చేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, గంటల తరబడి ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయని వెల్లడించారు. మరోసారి షెడ్‌లు వేస్తే క్రిమినల్ కేసులు నమోదు

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
బుధవారం 11-12-2024


# ఏఐపియుసి బాన్సువాడ డివిజన్ నూతన కమిటీ ఎన్నిక

## తక్షణమే విద్యాశాఖ మంత్రిని నియమించాలి-ఏఐపియుసి

## తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ స్కాలర్ షిప్ లను తక్షణమే విడుదల చేయాలి

## విద్య రంగ సమస్యలపై భవిష్యత్తు కార్యాచరణ కొరకు నూతన కమిటీ ఎన్నిక

## జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సాయికుమార్,బోడ అనిల్ వెల్లడి




**బాన్సువాడ క్రైమ్ మిర్రర్ న్యూస్:** అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం (ఏఐపియుసి) బాన్సువాడ డివిజన్ నూతన కమిటీని కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలోని భారతరత్న జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సాయికుమార్,బోడ అనిల్ మాట్లాడుతూ...విద్యారంగ సమస్యల పరిష్కారానికై ఏఐపియుసి విద్యార్థి సంఘం నిరంతరం అలుపెరగని పోరాటాలు చేస్తుందని,ఆ పోరాటాలకు ఆకర్షితులై బాన్సువాడ డివిజన్ కమిటీకి సంబంధించి విద్యార్థి నాయకులు చేరిక అయ్యారని,భవిష్యత్తు కార్యచరణ దృష్టిలో ఉంచుకొని ఏఐపియుసి నూతన కమిటీ వేసుకోవడం బాన్సువాడ డివిజన్ కమిటీ మొత్తం 13 మందితో ఎన్నుకోవడం జరిగిందని,బాన్సువాడ డివిజన్ కార్యదర్శిగా మూడ్ వినోద్,బాన్సువాడ డివిజన్ అధ్యక్షులుగా బి.శశి కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు.గత మూడు సంవత్సరాల నుంచి పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్,ఫీజు రియంబర్స్మెంట్ తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.బాన్సువాడ డివిజన్ పరిధిలోని పలు సమస్యలపై భవిష్యత్తు కార్యచరణ రూపొందించుకొని రానున్న రోజుల్లో,విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఈ నూతన కమిటీ ఉద్యమిస్తుందని విద్యార్థుల మన్ననలు పొందుతూ,విద్య రంగ సమస్యల పరిష్కారంకై పోరాటాలు చేస్తుందని అన్నారు.అనేక మంది యువత,విద్యార్థులు ఏఐపియుసి విద్యార్థి సంఘాన్ని ఆదరిస్తూ అండగా నిలుస్తున్నారని,సంక్షేమ హాస్టల్లో,గురుకులాలకు పెంచిన మెస్ చార్జీలు,కాస్మోటిక్ చార్జీలను తక్షణమే అమలు చేయాలన్నారు.గత రెండు మూడు నెలల్లో తెలంగాణ రాష్ట్రంలో కేజీబీవీ,గురుకులలో 51 మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్ అవ్వడంతో చనిపోవడం జరిగిందని,అయినప్పటికీ సీఎం రేవంత్ రెడ్డి విద్యార్థుల పట్ల సవతి తల్లి ప్రేమ చూపించడం సరికాదని అన్నారు.ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత లోపిస్తుందని,దానికి సంబంధించి కూడా పాఠశాల మధ్యాహ్నన భోజన మెస్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు.సంక్షేమ హాస్టల్లకు పక్క భవనాలను నిర్మించాలని ఈ సందర్భంగా వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.లేనియెడల రానున్న రోజుల్లో విద్యార్థులతో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని అన్నారు.స్కాలర్షిప్,ఫీజు రియంబర్స్మెంట్ విడుదలకు సంబంధించి అసెంబ్లీలో స్థానిక బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి గొంతు ఎత్తాలి అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐపియుసి నాయకులు మోహన్ సాయి,నితీష్,గణేష్,అనిల్,విద్యార్థులు కృష్ణ,అరవింద్,మౌనిక,జోష్న,తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ తల్లి విగ్రహ మార్పుపై సమాధానం చెప్పాలి : ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** మీర్పేట్ కార్పొరేషన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర పార్టీ ఆదేశానుసారం మహేశ్వరం నియోజకవర్గ పార్టీ ఆధ్వర్యంలో మీర్పేట్ కార్పొరేషన్ పరిధిలోని చందన చెరువు నందు గల తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీమంత్రి, మహేశ్వరం నియోజకవర్గము ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ తల్లి రూపాన్ని ఎందుకు మార్చారు అంటే ఈ ప్రభుత్వం దగ్గర సమాధానం లేదని ఈ విగ్రహాన్ని తెలంగాణ ఉద్యమంలో కేసిఆర్, మేధావులు, ఉద్యమకారులు అందరితో కలిసి చర్చించి తయారు చేయించిన విగ్రహం ప్రతిష్టాపన చేసుకున్నాం, ఈరోజు మనం చూస్తే ఈ ప్రభుత్వం కేసిఆర్ నమూనాలను చెరిపేసే ప్రయత్నం చేస్తున్నారని ఉదాహరణకు తెలంగాణ రాష్ట్ర చిహ్నంలో మార్పులు చేయడం, అలానే తెలంగాణ ఆడపడుచులు గౌరవం బతుకమ్మని ఈరోజు చేరిపివేయడం, బతుకమ్మ చీరలను మాయం చేయడం చూసుకోవచ్చు, నిన్న తెలంగాణ తల్లిని ఘనంగా ప్రతిష్టాపన చేస్కున్నామని చెప్పిన తరుణంలో తెలంగాణ ఆడపడుచులు అయిన ఆశ వర్కర్ల పైన దాడి చేయడం దుష్యాసన పర్వాన్ని చూస్తున్నామని, తెలంగాణ ఉద్యమంలో కేసిఆర్ ఉద్యమం చేస్తున్నపుడు తెలంగాణ వచ్చుడో కేసిఆర్ సచ్చుడో నినాదం ఫలప్రదం అయిన రోజని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మీర్ పేట్ కార్పొరేషన్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నియోజకవర్గం స్థాయి నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులు, అనుబంధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.




## తెలంగాణ తల్లి విగ్రహం మార్పు దురదృష్టకరం

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) :**ఆర్కేపురం డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, మహేశ్వర నియోజకవర్గం బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఆర్కేపురం డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో డిసెంబర్ 9 తెలంగాణ రాష్ట్ర ప్రజలకు చీకటి రోజని, తెలంగాణ తల్లిని అవమానించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న రోజుల్లో చీకటి రోజులు వస్తాయని ఆవేదన తెలిపారు. తెలంగాణ ఉద్యమంతో కేసీఆర్ రాష్ట్రాన్ని సాధించడంలో సఫలీకృతులయ్యారని తెలంగాణ రాష్ట్రం తొలి ముఖ్యమంత్రిగా కెసిఆర్ 10 సంవత్సరాలు తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారని, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అమలు కాని హామీలు ఇచ్చి ప్రభుత్వంలోకి వచ్చారని సంవత్సరం కాలంలోనే ప్రజల చేతుల్లో చివాట్లు తింటున్నారని తెలిపారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయుటలో మేధావులు ఉద్యమకారులు రాజకీయ పండితులు అందరూ కలిసి తెలంగాణ తల్లి విగ్రహాన్నీ రూపకల్పన చేశారని అలాంటి తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపురేఖలు మార్చి కాంగ్రెస్ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం దురదృష్టకరమని అరవింద్ శర్మ అన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు, మహిళా నాయకురాలు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు మెరుగైన చికిత్స అందించాలి...!

### తాండూరు ట్రైబల్ గర్ల్స్ హాస్టల్ ఫుడ్ పాయిజన్ కి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి...!

### మాజీ బీసీ కమిషన్ సభ్యులు శుభప్రద్ పటేల్..!



**క్రైమ్ మిర్రర్ వికారాబాద్ జిల్లా ప్రతినిధి:**వికారాబాద్ జిల్లా తాండూరు ట్రైబల్ గర్ల్స్ హాస్టల్ ఫుడ్ పాయిజన్ పై రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యులు,బీఆరెస్ రాష్ట్ర నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.మంగళవారం ఆయన ఓ ప్రకటనలో మాట్లాడుతూ ఇవి గురుకులాలా..? లేక నరక కూపాలా..? అని ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు.తాండూరులో 30 మంది విద్యార్థినిలు ఆసుపత్రి పాలుకావడం బాధాకరమన్నారు.పాఠాలు నేర్చుకోవడం కాదు ప్రాణాలతో బయటపడితే చాలు అనే పరిస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉన్న ప్రజలను విద్యార్థులను ఇబ్బందులు పెట్టినందుకేనా కాంగ్రెస్ ప్రభుత్వం విజయోత్సవాలు జరుపుకుంటుందా అని ప్రశ్నించారు.ఆస్పత్రి పాలైన విద్యార్థినీలకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.దానికి బాధ్యులు అయిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని లేదంటే పెద్ద స్థాయిలో నిరసన వ్యక్తం చేస్తామని తెలిపారు.

## మీడియా ప్రతినిధులపై మోహన్ బాబు దాడికి టీడబ్ల్యూజేఎఫ్ ఖండన

**హైదరాబాద్ (క్రైమ్ మిర్రర్):** మీడియా ప్రతినిధులపై సినీ నటుడు మోహన్ బాబు దాడి చేయడాన్ని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) తీవ్రంగా ఖండించింది. ప్రజలకు, ప్రభుత్వాలకు మధ్య వారధిగా ఉన్న మీడియాకు జవాబుదారిగా ఉండాల్సిన వ్యక్తులు అసహనంతో భౌతికదాడులకు పాల్పడడం సరైంది కాదని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధానకార్యదర్శులు మామిడిసోమయ్య, బి.బసవపున్నయ్య పేర్కొన్నారు. సమాజానికి వాస్తవాలు చెప్పడం కోసం పాత్రికేయులు వృత్తి నిబద్ధతతో పనిచేస్తారని, అలాంటి మీడియా ప్రతినిధులపై దాడీ చేసిన మోహన్ బాబు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మీడియా ప్రతినిధులపై దాడి చేసిన మోహన్ బాబుపై కేసు నమోదు చేయాలని, భవిష్యత్తులో ఇలాంటి దాడులు జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు.

## ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయం...!

### ఆరోగ్య ఉప కేంద్రాని ప్రారంభించి..అంగన్ వాడి విద్యార్థులకు దుస్తులు పంచిన ఎమ్మెల్యే..!

### గ్రామీణ ప్రాంత ప్రజల సౌకర్యార్థమే సబ్ సెంటర్ల ఏర్పాటు..!

### చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య...!




**క్రైమ్ మిర్రర్ వికారాబాద్ జిల్లా ప్రతినిధి:** గ్రామాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడానికి ఆరోగ్య ఉప కేంద్రాల పాత్ర కీలకమైందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు.మంగళవారం వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలం పులు మామిడి గ్రామంలో ఆరోగ్య ఉప కేంద్రాని మండల వైద్యాధికారి రోహిత్ తో కలిసి ప్రారంభించి,అంగన్ వాడి విద్యార్థులకు దుస్తులు అధికారుల,గ్రామస్తులతో కలిసి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలను అందు బాటులోకి తీసుకొచ్చిందని చెప్పారు.ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంతాల్లోనే పల్లె దవాఖానాలను ఏర్పాటు చేసి, మెరుగైన వైద్య సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు.అనంతరం అంగన్ వాడి కేంద్రంలో విద్యార్థిని విద్యార్థులకు ఏకరూప దుస్తులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గీతసింగ్ నాయక్,పిఏసిఎస్ చైర్మన్ రాంరెడ్డి,ఎంపీడీఓ అనురాధ,గ్రామ ప్రత్యేక అధికారిణి ప్రసన్న లక్ష్మి,మండలాధ్యక్షుడు మేడిపల్లి వెంకటయ్య,మాజీ సర్పంచ్ భీమ్ రెడ్డి, సెక్రటరీ భానుప్రసాద్,ఏఎంఎం శంకరమ్మ,అంగన్ వాడీ టీచర్స్ సంపత్ కుమారి,పద్మ మాజీ ఉప సర్పంచ్ ఊరేళ్ళ సుధాకర్, నక్క నర్సిములు,నాయకులు కందడ నాగిరెడ్డి,కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి,మాజీ వార్డ్ నెంబర్ బుచ్చిరెడ్డి, ఇబ్రహీం, శ్రీనివాస్,గ్రామ పెద్దలు విఠల్ రెడ్డి,జానీ,ఆమెర్, రాములు, గోపాల్ రెడ్డి,వెంకట్ రెడ్డి,మురళి,చెంద్రయ్య, రామ్ చెంద్రయ్య,మల్లేశం,గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

## టిపిటిఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నిక



**కామారెడ్డి క్రైమ్ మిర్రర్ న్యూస్:** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని వశిష్ట డిగ్రీ కాలేజీలో టిపిటిఎఫ్ కామారెడ్డి జిల్లా కార్యవర్గ సమావేశం మంగళవారం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ అనిల్ కుమార్ హాజరై ప్రసంగించారు.జిల్లా కార్యవర్గ సమావేశంలో నూతనంగా టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా చింతల లింగం,జిల్లా ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్ రెడ్డిని జిల్లా కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.వారికి రాష్ట్ర శాఖ పక్షాన అభినందనలు తెలిపారు.ఈ కార్యవర్గ సమావేశంలో సిహెచ్ లక్ష్మి,విజయ శ్రీ,తృప్తి శ్రీనివాస్,హరి సింగ్ నరేందర్,గోపి శ్రీనివాస్,సిహెచ్ ప్రకాష్,కృష్ణ,కృష్ణమూర్తి,హరీష్,కే ఎన్ భగత్ రామా గౌడ,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహా ధర్నాకు వెళ్తున్న ఆశ వర్కర్ల అరెస్టు



**పిట్లం క్రైమ్ మిర్రర్ న్యూస్:** ఆశా వర్కర్ల పరిష్కారం కోసం చలో హైదరాబాద్ మహాధర్నాకు వెళు తున్న ఆశా వర్కర్లను ముందస్తుగా పిట్లం మండల కేంద్రంలో మండల ఆశా వర్కర్ల అధ్యక్షురాలు కామేశ్వరినీ పిట్లం పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు.చలో అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన ఆశా కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....అరెస్టులతో తమ ఉద్యమాన్ని ఆపలేరని అన్నారు.

## అయ్యప్ప స్వాములకు బిక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన పిట్లం మాజీ ఎంపీపీ దంపతులు



**పిట్లం క్రైమ్ మిర్రర్ న్యూస్:** కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో మంగళవారం పిట్లం మాజీ ఎంపీపీ కవిత విజయ్ సతీ సమేతంగా పాల్గొని పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించి,ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం అయ్యప్ప స్వాములకు భిక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ తల్లికి అవమానం



**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** ఎల్బీనగర్ నియోజకవర్గం చైతన్యపురి డివిజన్ ప్రభాత్ నగర్ లో చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలువు మేరకు స్థానిక ఎమ్మెల్యే దేవీరెడ్డి సుధీర్ రెడ్డి తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఎమ్మెల్యే దేవీరెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ మేధావులు, ఉద్యమకారులు కలిసి ఏర్పాటుచేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడం దురదృష్టకరమని, కెసిఆర్ ఎన్నో సంస్కరణలు చేసి తెలంగాణను అభివృద్ధి చేశారని, దొంగ హామీలు ఇచ్చి ఓట్లు వేయించుకొని ప్రజలను మోసం చేసిన రేవంత్ రెడ్డి దౌర్జన్యాలు ఇకపై సాగవని ప్రజల తరపున పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైతన్యపురి డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు తోట మహేష్ యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

## అర్జున్ అదరహో

### 13 పాయింట్లతో మెరిసిన పింక్‌పాంథర్స్ రెయిడర్

### గుజరాత్ జెయింట్స్‌పై జైపూర్ విజయం



పుణే: స్టార్ రెయిడర్ అర్జున్ దేశ్వాల్ 13 పాయింట్లతో సత్తా చాటాడు. దాంతో ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 11వ సీజన్‌లో జైపూర్ పింక్‌పాంథర్స్ తొమ్మిదో విజయం నమోదు చేసుకుంది. మంగళవారం జరిగిన ఈ పోరులో పింక్‌పాంథర్స్ 42%-%29 పాయింట్ల తేడాతో గుజరాత్ జెయింట్స్‌పై విజయం సాధించింది. మ్యాచ్ ఆరంభం నుంచి సూపర్ రెయిడ్‌లతో అర్జున్ అదరగొట్టగా... నీరజ్ నర్వాల్ (8 పాయింట్లు) అతడికి సహకరించాడు. గుజరాత్ జెయింట్స్ జట్టు తరఫున గుమాన్ సింగ్, రాకేశ్ చెరో 9 పాయింట్లు సాధించారు. తాజా సీజన్‌లో 18 మ్యాచ్‌లు ఆడిన జైపూర్ పింక్ పాంథర్స్ 9 విజయాలు, 7 పరాజయాలు, 2 'టై'లతో 54 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టికలో ఆరో స్థానంలో కొనసాగుతోంది. మరోవైపు గుజరాత్ కేవలం ఐదు విజయాలతో పట్టికలో 11వ స్థానంలో ఉంది. మరో మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్ 44%-%29 పాయింట్ల తేడాతో బెంగళూరు బుల్స్‌పై గెలుపొందింది. వారియర్స్ తరఫున విశ్వాస్ 14 పాయింట్లు, ప్రణయ్ 9 పాయింట్లతో రాణించగా... బెంగళూరు తరఫున స్టార్ రెయిడర్, 'డుబ్కీ కింగ్' ప్రదీప్ నర్వాల్ 14 పాయింట్లతో ఒంటరి పోరాటం చేసినా ఫలితం లేకపోయింది. నేడు జరిగే మ్యాచ్‌ల్లో హరియాణా స్టీలర్స్‌తో బెంగళూరు బుల్స్ (రాత్రి 8 గంటలకు), యు ముంబాతో తమిళ్ తలైవాస్ (రాత్రి 9 గంటలకు) తలపడతాయి.



## క్లీన్‌స్వీప్ తప్పించుకోవాలని...

### నేడు ఆస్ట్రేలియా మహిళల జట్టుతో భారత్ చివరి వన్డే

### ఉదయం గం. 9:50 నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

పెర్త్: ఇప్పటికే ఆస్ట్రేలియా చేతిలో వన్డే సిరీస్ కోల్పోయిన భారత మహిళల జట్టు నేడు ఆఖరి వన్డే బరిలోకి దిగనుంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా జరిగిన తొలి రెండు వన్డేల్లోనూ ఓడిన హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత జట్టు... బుధవారం పెర్త్ వేదికగా చివరి మ్యాచ్‌లో ఆస్ట్రేలియాతో పోటీపడనుంది. ఇటీవల సొంతగడ్డపై న్యూజిలాండ్‌పై వన్డే సిరీస్ నెగ్గిన టీమిండియా... ఆసీస్ చేతిలో క్లీన్‌స్వీప్ తప్పించుకోవాలని ప్రయత్నిస్తోంది. వచ్చే ఏడాది భారత్‌లో వన్డే ప్రపంచకప్ జరగనున్న నేపథ్యంలో మెగా టోర్నీకి ముందు... ఆఖరి వన్డేలో నెగ్గి హర్మన్ బృందం ఆత్మవిశ్వాసం కూడగట్టుకుంటుందా చూడాలి. గత రెండు మ్యాచ్‌ల్లోనూ ఆస్ట్రేలియా సంపూర్ణ ఆధిపత్యం కనబర్చగా... భారత జట్టు అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌లో ఘోర ప్రదర్శన కనబర్చింది. సీనియర్ ప్లేయర్లు హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతి మంధాన స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోగా... మిగిలిన వాళ్లు కూడా సత్తా చాటడం లేదు. దీంతో బ్యాటింగ్ వైఫల్యం జట్టును దెబ్బ తీస్తోంది. ఇక చివరి మ్యాచ్‌లోనైనా టీమిండియా కలిసికట్టుగా కదంతొక్కాలని టీమ్ మేనేజ్‌మెంట్ ఆశిస్తోంది. వరల్డ్‌కప్‌నకు ముందు బ్యాటింగ్ కూర్పునకు ఈ సిరీస్ ఉపయోగపడుతుందని భావించగా... అదీ సాధ్యపడలేదు. ఫామ్ కోల్పోయి జట్టుకు దూరమైన యువ ఓపెనర్ షఫాలీ వర్మ స్థానంలో ఎవరిని ప్రయత్నించినా... ముద్ర వేయలేకపోగా... మిడిలార్డర్‌లో జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్ మినహా తక్కిన వాళ్లెవరూ చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడలేదు.త రెండు మ్యాచ్‌ల్లో కలిపి ఆసీస్ ప్లేయర్లు 2 సెంచరీలు, 2 అర్ధసెంచరీలు నమోదు చేస్తే... భారత్ నుంచి అత్యధికంగా రిచా ఘోష్ మాత్రమే ఒక హాఫ్ సెంచరీ చేసింది. రెండో వన్డే ఓటమి అనంతరం హర్మన్‌ప్రీత్ మాట్లాడుతూ... 'ఎక్కువ సేపు క్రీజులో నిలవడంపై దృష్టి పెట్టాలి. మొత్తం 50 ఓవర్లు ఆడటంతో పాటు... బౌలింగ్‌లోనూ భిన్నమైన ప్రణాళికలు అమలు చేయాలి' అని చెప్పింది. మరి మూడో మ్యాచ్‌లోనైనా అలాంటి ప్రయత్నం చేస్తారా చూడాలి. మరోవైపు సీనియర్ ప్లేయర్లు అందుబాటులో లేకపోయినా... ఆసీస్ అమ్మాయిలు అదరగొడుతున్నారు. ఈ సిరీస్‌తోనే అంతర్జాతీయ అరంగేట్రం చేసిన జార్జియా వోల్... భారత బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొని పరుగులు రాబడుతోంది. ఆ తెగింపు మన ప్లేయర్లు కూడా కనబర్చాల్సిన అవసరముంది

# ప్రాక్టీస్.. ప్రాక్టీస్

### మూడో టెస్టు కోసం భారత్ సన్నాహం

### అడిలైడ్‌లో చెమటోడుస్తున్న క్రికెటర్లు



అడిలైడ్: ఆస్ట్రేలియాతో మూడో టెస్టు కోసం భారత్ సన్నాహాలు మొదలుపెట్టింది. అడిలైడ్ డే అండ్ నైట్ టెస్టులో భారీ ఓటమి తర్వాత టీమ్ఇండియా సిరీస్‌లో మళ్లీ పుంజుకునేందుకు పట్టుదలతో కనిపిస్తున్నది. బ్రిస్బేన్ వేదికగా ఈనెల 14 నుంచి మొదలయ్యే మూడో టెస్టు కోసం అడిలైడ్‌లో ప్రాక్టీస్ మొదలుపెట్టింది. విరాట్‌కోహ్లీ, యశస్వి జైస్వాల్, కెప్టెన్ రోహిత్‌శర్మ, రిషబ్ పంత్ బ్యాటింగ్ ప్రాక్టీస్ చేయగా బౌలర్లు ఆకాశ్‌దీప్‌సింగ్, యశ్ దయాల్, హర్షిత్‌రానా బౌలింగ్ చేశారు. ముఖ్యంగా ఫామ్‌లేమితో నానా ఇబ్బందులు పడుతున్న కెప్టెన్ రోహిత్‌శర్మ ఎక్కువసేపు నెట్స్‌లో గడిపాడు. రెండో టెస్టులో రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 9 పరుగులకే పరిమితమైన హిట్‌మ్యాన్ ఎలాగైనా గాడిలో పడాలన్న కసితో ఉన్నాడు. ఓవైపు పేసర్లతో పాటు స్పిన్నర్లను సమర్థంగా ఎదుర్కొంటూ షాట్లు ఆడాడు.గత 12 ఇన్నింగ్స్‌ల్లో 142 పరుగులు మాత్రమే చేసిన రోహిత్ తిరిగి ఫామ్‌లోకి వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడు. పెర్త్ టెస్టులో సెంచరీతో అదరగొట్టిన కోహ్లీ ఎడ్జింగ్ డెలివరీలు ఎలా ఎదుర్కోవాలో ప్రాక్టీస్ చేశాడు. ఓపెనర్ కేఎల్ రాహుల్ ఎక్కువగా డిఫెన్స్‌కు ప్రాధాన్యమివ్వగా, వికెట్‌కీపర్ రిషబ్ పంత్ భారీ షాట్లు ఆడాడు. పెర్త్ టెస్టులో సూపర్ సెంచరీతో కదంతొక్కిన జైస్వాల్ ఎక్కువ సేపు ప్రాక్టీస్‌లో గడిపాడు.బౌలర్ల విషయానికొస్తే..ఆకాశ్‌దీప్‌సింగ్, దయాల్, రానాతో పాటు స్పిన్నర్లు జడేజా, అశ్విన్, సుందర్ బౌలింగ్ సాధన చేశారు. వీరికి త్రోడౌన్ స్పెషలిస్టులు సహకారం అందజేశారు. బుమ్రా, సిరాజ్, నితీశ్‌కుమార్ కొద్దిసేపే ప్రాక్టీస్‌కు పరిమితమయ్యారు. బుధవారం భారత జట్టు బ్రిస్బేన్‌కు బయల్దేరి వెళ్లనుంది. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో ముందంజ వేసే సమయం ఆసన్నమైందంటూ క్రికెటర్ల ప్రాక్టీస్ సెషన్ వీడియోను బీసీసీఐ తమ అధికారిక ఎక్స్‌లో ట్వీట్ చేసింది.



## బాక్సింగ్ డే కు భలే గిరాకీ

మెల్‌బోర్న్: భారత్, ఆస్ట్రేలియా మధ్య ఈనెల 26 నుంచి మొదలయ్యే బాక్సింగ్ డే టెస్టు టిక్కెట్ల కోసం భలే గిరాకీ ఏర్పడింది. మెల్‌బోర్న్‌లో జరిగే ఈ నాలుగో టెస్టు తొలి రోజు ఆట టిక్కెట్లన్నీ హాట్‌హాట్‌గా అమ్ముడుపోయినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.ఈ మ్యాచ్‌కు వేదికైన మెల్‌బోర్న్ స్టేడియం సామర్థ్యం లక్ష. మ్యాచ్‌కు మరో రెండు వారాల సమయమున్నా టిక్కెటన్నీ అమ్ముడుపోవడం భారత్-ఆసీస్ మ్యాచ్‌కు ఉన్న ఆదరణకు ఉదహరణగా నిలుస్తున్నది. తాజాగా ముగిసిన అడిలైడ్ టెస్టులో మూడు రోజుల్లో మ్యాచ్ వీక్షించిన అభిమానులు లక్షా 35వేల మందిగా రికార్డయ్యారు. ఓవరాల్‌గా గతంతో పోల్చిచూస్తే ఇది కొత్త రికార్డు కావడం విశేషం.

## క్రికెటర్ టు పెయింటర్

### చిత్రకారునిగా మారిన ఒలాంగా



హరారే: జింబాబ్వే మాజీ పేసర్ హెన్రీ ఒలాంగా పేరు గుర్తుండే ఉంటుంది. తన స్వింగ్ బౌలింగ్‌తో దిగ్గజ క్రికెటర్ సచిన్ టెండూల్కర్‌ను ఇబ్బంది పెట్టిన ఒలాంగా ఇప్పుడు కొత్త కెరీర్ ఎంచుకున్నాడు. తాజాగా ముగిసిన అడిలైడ్ టెస్టులో ఒలాంగా పెయింటర్‌గా కనిపించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. 2003లో చివరి అంతర్జాతీయ మ్యాచ్ ఆడిన ఒలాం గా..రచయితగా, సామాజిక కార్యకర్తగా, అంపైర్‌గా, కోచ్‌గా పాత్రలు పోషించి ఇప్పుడు పెయింటర్‌గా తన ప్రతిభ నిరూపించుకుంటున్నాడు. అడిలైడ్ టెస్టు సందర్భంగా పెయిటింగ్ చేస్తు న్న ఒలాంగాను గుర్తించిన కొందరు అభిమానులు ఎక్స్‌లో పోస్ట్ చేయడంతో అది వైరల్‌గా మారింది.

## శ్రీకాంత్ పసిడి పరుగు

### జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ టోర్నీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఒడిశా వేదికగా జరుగుతున్న 39వ జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర యువ అథ్లెట్లు నైని శ్రీకాంత్, అప్పాల వరుణ్, తోలెం శ్రీతేజ అదరగొట్టారు. మంగళవారం జరిగిన పెంటాథ్లాన్ ఈవెంట్‌లో శ్రీకాంత్ 3905 పాయింట్లతో సరికొత్త జాతీయ రికార్డు నెలకొల్పుతూ పసిడి పతకం దక్కించుకోగా, వరుణ్ 3856 పాయింట్లతో రజతం కైవసం చేసుకున్నాడు. మరోవైపు హెప్టాథ్లాన్‌లో శ్రీతేజ 5087 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. మొత్తంగా ముగ్గురు అథ్లెట్లు జాతీయ స్థాయిలో సత్తాచాటి రాష్ట్ర ఖ్యాతిని పెంచారు.



GHMC
hmda Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com



SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

# బాబు క్యాబినెట్‌లోకి నాగబాబు!?

## మంత్రి పదవిని నాగబాబుకు కేటాయించాలని నిర్ణయం!

### త్వరలోనే అధికారికంగా రానున్న ప్రకటన

**అమరావతి,(క్రైమ్ మిర్రర్):** జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నటుడు నాగబాబును రాజ్యసభకు పంపుతారనే ప్రచారం ఇటీవల జోరుగా సాగింది. రాష్ట్రంలో ఖాళీ అయిన మూడు స్థానాల్లో ఒకటి నాగబాబుకు ఇస్తారని ఊహాగానాలు వెలువడ్డాయి. కానీ, మూడు సీట్లకు వేరే అభ్యర్థులను ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆయనకు మంత్రి పదవి దక్కనున్నట్లు తెలిసింది. నాగబాబును మంత్రివర్గంలోకి చంద్రబాబు తీసుకోనున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఏపీలో ఎమ్మెల్యేల సంఖ్య ప్రకారం 25 మందిని క్యాబినెట్‌లోకి తీసుకొవచ్చు. ప్రస్తుతం 24 మంది మంత్రులు ఉన్నారు. ఇందులో జనసేన నుంచి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో పాటు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, బీజేపీ నుంచి ఒకరికి మంత్రిగా అవకాశం దక్కింది. ఇప్పుడు ఏపీ క్యాబినెట్‌లోకి నాగబాబును కూడా తీసుకోనున్నట్లు సమాచారం. మిగిలిన ఆ ఒక్క మంత్రి పదవిని నాగబాబుకు కేటాయించాలని నిర్ణయించినట్లు తెలిసింది. దీనిపై త్వరలోనే అధికార ప్రకటన రానున్నట్లు సమాచారం.



# ఏపీ హైకోర్టులో సజ్జలకు ఊరట

### ముందస్తు బెయిల్ కోరుతూ ఏపీ హైకోర్టును ఆశ్రయించిన సజ్జల

### సజ్జలపై తొందరపాటు చర్యలు తీసుకోవద్దన్న ఉన్నత న్యాయస్థానం

### గతంలో ఇచ్చిన ఆదేశాలు పొడిగింపు



**అమరావతి,(క్రైమ్ మిర్రర్):** టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ అగ్రనేత సజ్జల రామకృష్ణారెడ్డికి ఏపీ హైకోర్టులో ఊరట లభించింది. సజ్జల రామకృష్ణారెడ్డిపై మరో రెండు వారాల పాటు తొందరపాటు చర్యలు తీసుకోవద్దని హైకోర్టు పోలీసులను ఆదేశించింది. ఈ కేసులో సజ్జల ముందస్తు బెయిల్ కోరుతూ ఇటీవల పిటిషన్ దాఖలు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తమను వేధిస్తున్నారని సజ్జల ఆరోపించారు. ముఖ్యంగా, తనపై 41ఏ నోటీసులకు అవకాశం లేని సెక్షన్లతో కేసులు పెట్టి అరెస్ట్ చేయాలని ప్రయత్నిస్తున్నారని వివరించారు. అందుకే తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని సజ్జల కోర్టును కోరారు. ఈ పిటిషన్ పై ఉన్నత న్యాయస్థానం నేడు విచారణ చేపట్టింది. ఇరువైపులా వాదనలు విన్న హైకోర్టు... గతంలో ఇచ్చిన ఆదేశాలను మరో రెండు వారాలు పొడిగించింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

# రాంగోపాల్‌వర్మకు ఏపీ హైకోర్టులో ఊరట

### షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు

### దర్యాప్తుకు సహకరించాలని ఆదేశం



**అమరావతి,(క్రైమ్ మిర్రర్):** రాంగోపాల్‌వర్మకు ఏపీ హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. కాగా దర్యాప్తునకు సహకరించాలని, పోలీసులు కోరినప్పుడు విచారణకు హాజరుకావాలని రాంగోపాల్‌వర్మను ఆదేశించింది. సోషల్ మీడియాలో చంద్రబాబు, పవన్, లోకేశ్?పై అసభ్యకర పోస్టులపై కేసుకు సంబంధించిన పిటిషన్?పై ఏపీ హైకోర్టు ఇవాళ విచారణ చేపట్టింది. ఈ మేరకు వర్మకు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది.

# నేను పార్టీలు మారడం లేదు..

### పార్టీలే నా వద్దకు వస్తున్నాయి: ఆర్ కృష్ణయ్య

**అమరావతి,(క్రైమ్ మిర్రర్):** బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. బీజేపీ పార్టీ తరుపున ఆంధ్రప్రదేశ్ నుంచి ఆర్. కృష్ణయ్య పోటీ చేస్తున్నారు. నామినేషన్ అనంతరం మీడియాతో మాట్లాడిన ఆర్. కృష్ణయ్య.. బీసీ రిజర్వేషన్లపై చట్టసభల్లో పోరాటం చేస్తానన్నారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించడం ప్రస్తుత పరిస్థితుల్లో బీజేపీతోనే సాధ్యమన్నారు. బీసీల కోసం తాను చేస్తున్న సేవలను గుర్తించి బీజేపీ ఈ అవకాశం ఇచ్చిందన్నారు. మరోవైపు తాను పార్టీలు మారడం లేదన్న ఆర్. కృష్ణయ్య పార్టీలే తన వద్దకు వస్తున్నాయని అన్నారు. టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన ఆర్. కృష్ణయ్య.. ఆ తర్వాతి కాలంలో వైసీపీలో చేరారు. వైసీపీ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. అయితే రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన కృష్ణయ్య.. ఇప్పుడు అదే స్థానానికి బీజేపీ నుంచి పోటీ చేస్తున్నారు.

# మహిళలకు లాడ్లీ బహనా యోజన కింద ఏటా రూ.15 వేలు

### నేడు లబ్ధిదారుల 19వ విడుత ఖాతాల్లోకి జమ

**న్యూఢిల్లీ (క్రైమ్ మిర్రర్):** మహిళల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రకరకాల పథకాలు ప్రవేశపెడుతూ ఉంటాయి. ఈ క్రమంలోనే నెల నెలా అకౌంట్లలో డబ్బులు జమ చేస్తూ ఉంటారు. ఈ నేపథ్యంలోనే లాడ్లీ బహనా యోజన కింద మహిళలకు ఏటా రూ.15 వేలు జమ చేస్తోంది. ఈ నేపథ్యంలోనే ఈ లాడ్లీ బహనా యోజనలో భాగంగా 19వ ఇన్‌స్టాల్‌మెంట్ కింద రేపు లబ్ధిదారుల ఖాతాల్లోకి డబ్బులు జమ చేయనున్నారు. మధ్యప్రదేశ్‌లో అధికారంలో ఉన్న మోహన్ యాదవ్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం.. మహిళల కోసం లాడ్లీ బహనా యోజన పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం కింద లబ్ధిదారులైన మహిళల ఖాతాల్లో నెలకు రూ.1250 జమ చేస్తోంది. మొత్తంగా ఒక్కో మహిళకు ఏడాదికి రూ.15 వేలు అందిస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా లాడ్లీ బహనా యోజన 19వ ఇన్‌స్టాల్‌మెంట్ కింద రేపు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్.. డబ్బులు అకౌంట్లలో వేయనున్నారు. ఈ సందర్భంగా అర్హులైన మహిళలు.. తమ ఖాతాల్లో డబ్బులు పడ్డాయో లేదో తెలుసుకునేందుకు వెబ్‌సైట్‌లో చెక్ చేసుకోవాలని మధ్యప్రదేశ్ ప్రభుత్వ అధికారులు చెబుతున్నారు. డిసెంబర్ 11వ తేదీన జన్ కళ్యాణ్ పర్వ్ ప్రారంభించనున్న సీఎం మోహన్ యాదవ్.. లాడ్లీ బహనా యోజన 19వ విడత డబ్బులు విడుదల చేయనున్నారు.లాడ్లీ బహనా యోజన కింద ప్రతీ మహిళకు నెలకు రూ.1250 చొప్పున ఏడాదికి రూ.15వేలు అందనున్నాయి. ఆధార్ కార్డుతో లింక్ అయిన బ్యాంక్ అకౌంట్‌లో నేరుగా డబ్బులు జమ చేయనున్నారు. 2023 జూన్ నుంచి మధ్యప్రదేశ్‌లో మహిళలకు ఆర్థికంగా స్వతంత్ర్యంగా తమ కాళ్ల మీద తాము నిలబడేందుకు, వారి పిల్లలకు నాణ్యమైన పోషకాహారాన్ని అందించేందుకు గానూ బీజేపీ ప్రభుత్వం ఈ లాడ్లీ బహనా యోజనను ప్రవేశపెట్టింది. లాడ్లీ బహనా యోజన కింద ప్రభుత్వం నుంచి నేరుగా సాయం పొందేందుకు లబ్ధిదారులు తప్పనిసరిగా మధ్యప్రదేశ్‌కు చెందినవారు అయి ఉండాలి. మహిళలకు పెళ్లి అయి ఉండాలి. భర్త చనిపోయిన మహిళలు, విడాకులు తీసుకున్న వారు, ఒంటరి మహిళలు ఎవరైనా ఈ లాడ్లీ బహనా యోజనకు అప్లై చేసుకోవచ్చు.

# రాష్ట్ర విభజనను పార్లమెంట్‌లో తలుపులు మూసేసి చేశారు

- ఏపీకి జరిగిన అన్యాయంపై తాను పదేళ్లుగా పోరాడుతూనే ఉన్నా
- ఎన్డీఏలో కీలకంగా ఉన్నందున పవన్ ఆ బాధ్యత తీసుకోవాలి
- రాష్ట్రం నుంచి కూడా అఫిడవిట్ దాఖలు చేయాలి
- పవన్ కళ్యాణ్‌కు రాజమండ్రి మాజీ ఎంపీ ఉండవల్లి లేఖ



**అమరావతి,(క్రైమ్ మిర్రర్):** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు రాజమండ్రి మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ బహిరంగ లేఖ రాశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజనను పార్లమెంట్‌లో తలుపులు మూసేసి చేశారన్న ఉండవల్లి అరుణ్ కుమార్.. ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయంపై తాను పదేళ్లుగా పోరాడుతూనే ఉన్నానని చెప్పారు. ఈ విషయమై సుప్రీంకోర్టులో తాను పిటిషన్ వేస్తే.. కేంద్రం ఇన్నేళ్లయినా కౌంటర్ దాఖలు చేయలేదని చెప్పారు. అలాగే ఎన్డీఏ ప్రభుత్వంలో కీలకంగా ఉన్నందున పవన్ కళ్యాణ్ ఆ బాధ్యత తీసుకోవాలని.. రాష్ట్రం నుంచి కూడా అఫిడవిట్ దాఖలు చేయాలని ఉండవల్లి సూచించారు.ఈ విషయంలో తాను సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్ పదేళ్లుగా నడుస్తూనే ఉందన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకూ కనీసం కౌంటర్ దాఖలు చేయలేదన్నారు. అలాగే కేంద్రం నుంచి రాష్ట్రానికి రూ. 74542 కోట్లు బకాయిలు రావాలని ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ తేల్చిన విషయాన్ని ప్రస్తావించారు. ఆ తర్వాత 2018లో అప్పటి సీఎం నారా చంద్రబాబు నాయుడు కలిసి ఈ విషయమై చర్చించానని.. దీనిపై లోక్ సభలో చర్చించేందుకు నోటీసు ఇవ్వాలని, సుప్రీంకోర్టులో రాష్ట్రం తరుపున అఫిడవిట్ దాఖలు చేయాలని చంద్రబాబు నిర్ణయించారని చెప్పారు. కానీ అవి ఇప్పటికీ అమలు కాలేదని ఉండవల్లి విమర్శించారు. 2019లో విజయవాడలో ఏర్పాటు చేసిన సమావేశంలో మనకు జరిగిన అన్యాయంపై పార్లమెంటులో చర్చించాలని, సుప్రీంకోర్టులో ప్రస్తావించాలని తీర్మానించామని.. కానీ నాటి ఎన్నికల్లో వైసీపీ గెలిచిందని ఉండవల్లి అరుణ్ కుమార్ లేఖలో పేర్కొన్నారు. ఏపీకి జరిగిన అన్యాయంపై సుప్రీంకోర్టులో రాష్ట్రం తరుపున అఫిడవిట్ దాఖలు చేయాలని.. ఆ తర్వాత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కూడా తాను లేఖ రాశానని కానీ తనకు ఎలాంటి సమాధానం రాలేదని ఉండవల్లి పేర్కొన్నారు. అయితే 2022లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరుపున కోర్టుకు హాజరైన సీనియర్ అడ్వకేట్ అభిషేక్ సింఘ్వీ .. తాను వేసిన పిటిషన్‌పై విచారణను మూసివేయాలని కోరినట్లు ఉండవల్లి గుర్తుచేశారు. 2014 ఫిబ్రవరిలో పార్లమెంటులో జరిగిన ఘటనలపై, ఏపీకి జరిగిన అన్యాయంపై టీడీపీ, వైసీపీ సభ్యులు చర్చకు నోటీసులు ఇవ్వడం లేదన్న ఉండవల్లి.. ఎక్కడైతే మన నోరు నొక్కి సభా నిబంధనలను తుంగలో తొక్కి భారత రాజ్యాంగాన్ని భ్రష్టు పట్టించారో... అక్కడే మనకు జరిగిన అన్యాయాన్ని ఎలుగెత్తి చాటాలని కోరారు. ప్రస్తుతం టీడీపీ, జనసేన పార్టీలు ఎన్డీయే కూటమిలో ఉండటంతో జరిగిన అన్యాయాన్ని సరిదిద్దడానికి ఇదే సరైన సమయమని ఉండవల్లి అరుణ్ కుమార్ అభిప్రాయపడ్డారు.ఈ విషయంలో శ్రద్ధ తీసుకుని, పార్లమెంటు ఉభయ సభల్లోనూ విభజన జరిగిన తీరు, ఏపీకి జరిగిన అన్యాయంపై చర్చకు నోటీసు లిప్పించాలనీ, సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర విభజన అంశాన్ని ఒక కొలిక్కి తీసుకురావాలని ఉండవల్లి అరుణ్ కుమార్ పవన్ కళ్యాణ్‌ను కోరారు.

# స్టీల్ ప్లాంట్ ఏర్పాటుపై మీ ముసుగు తీయండి సార్:వైఎస్ షర్మిల

**అమరావతి, (క్రైమ్ మిర్రర్):** కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటుపై కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి చేసిన వ్యాఖ్యలు మరోసారి రాష్ట్ర ప్రజలను అవమానించినట్లే అని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి అన్నారు. ఎక్స్ వేదికగా షర్మిల స్పందిస్తూ.. అసలు ప్లాంట్ ప్రతిపాదనే తమ దగ్గర లేదని అపహస్యం చేసినట్లు మాట్లాడటం నిజంగా సిగ్గుచేటన్నారు. ప్రతిపాదన వస్తే ఆలోచన చేస్తామని చెప్పడం ఏపీ రాష్ట్ర ప్రయోజనాలతో బీజేఏ చెలగాటం ఆడుతోందనడాని నిదర్శమన్నారు. ఇంత జరుగుతున్నా రాష్ట్ర ఎంపీలు మౌనంగా ఉండటం వారి చేతకాని తనానికి అద్దం పడుతుందని విమర్శించారు. కడప ఉక్కు సీమ ప్రజల హక్కు అని.. రాష్ట్ర విభజన సమయంలో కేంద్రమే ఆధ్వర్యంలో నిర్మించి ఇచ్చేలా కాంగ్రెస్ సారథ్యంలోని యూపీఏ ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చిందని.. విభజన చట్టంలోనూ పెట్టిందన్నారు. అనంతరం అధికారంలోకొచ్చిన బీజేపీ సర్కార్ విభజన హామీలను కాల రాసిందని విమర్శించారు. సీమ ప్రజల మనోభావాలను దెబ్బతీసిందని మండిపడ్డారు. కడప ప్రజలకు తీరని ద్రోహం చేసిందన్నారు. తిరుపతి వేదికగా కడప స్టీల్‌పై ప్రధాన మోదీ హామీ ఇచ్చారని.. ఆ తరువాత సాధ్యం కాదని, సొంత గనులు లేకుండా కష్టమని, లాభదాయకంగా లేదని సన్నాయి నొక్కులు నొక్కారని వ్యాఖ్యలు చేశారు. “ముఖ్యమంత్రి చంద్రబాబును సూటిగా ప్రశ్నిస్తున్నాం. కడప స్టీల్‌పై మీ వైఖరి ఏంటి? కేంద్ర ఉక్కుశాఖ మంత్రి ప్రకటనకు మీరిచ్చే



సమాధానం ఏంటి? అసలు కేంద్రం పరిశీలనలో లేదనడం మీరు సమర్థిస్తారా ? కడప స్టీల్ ప్లాంట్ కడతారా ? కట్టరా? ఇప్పటికైనా స్టీల్ ప్లాంట్‌పై మీ ముసుగు తీయండి సార్. అనాడు బీజేపీ మోసం చేసిందని, కేంద్రం సహకరించక పోయినా.. రాష్ట్ర ప్రభుత్వమే ప్లాంట్ కడుతుందని ఒకసారి మీరు కొబ్బరి కాయ కొడితే... రాష్ట్ర ప్రభుత్వంతో పాటు ప్రైవేట్ భాగస్వామ్యం ఉండాలని మాజీ ముఖ్యమంత్రి జగన్ రెండు సార్లు టెంకాయలు కొట్టారు. నాలుగు సార్లు శంకుస్థాపన జరిగి ఒక్క అంగుళం కూడా ముందుకు కదలని ప్రాజెక్టు ప్రపంచంలో ఏదైనా ఉందంటే అది కడప స్టీల్ మాత్రమే” అని అన్నారు. “కేంద్రంలో బీజేపీ మూడో సారి అధికారంలో ఉందంటే మీ మద్దతుతోనే. మీకు రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యం అనుకుంటే, మోడీ ఇచ్చిన పదవులు ముఖ్యం కాకపోతే, విభజన హక్కు ప్రకారం కడప స్టీల్‌ను కేంద్రం నిర్మించి ఇచ్చేలా ప్రకటన చేయించండి.

# పవన్‌కళ్యాణ్ బెదిరింపుకాల్స్ నిందితుడి అరెస్టు

**అమరావతి, (క్రైమ్ మిర్రర్):** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేషీకి బెదిరింపు కాల్స్ రావడం కలకలం రేపింది. పవన్‌ను చంపేస్తామని హెచ్చరిస్తూ గుర్తు తెలియని వ్యక్తి నుంచి బెదిరింపు ఫోన్ కాల్స్, అభ్యంతరకర భాషతో సందేశాలు రావడంతో ఏపీ ప్రభుత్వం అప్రమత్తమైంది. రంగంలోకి దిగిన పోలీసులు పురోగతి సాధించారు. ఫోన్ కాల్స్ ఆధారంగా నిందితుడిని గుర్తించారు. బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు నూక మల్లికార్జున్ అని, మానసిక స్థితి సరిగ్గా లేదని, మద్యం మత్తులో బెదిరింపు కాల్స్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. అదుపులోకి తీసుకున్న నిందితుడిని విజయవాడ పోలీసులు విచారిస్తున్నారు. గతంలో వైజాగ్‌లో నూక మల్లికార్జున్‌పై 354 కేసు నమోదైంది.


# వేస్ట్‌తో విద్యుత్ ఉత్పత్తి

### ప్లాంట్‌ను పరిశీలించిన మంత్రి నారాయణ



**అమరావతి,(క్రైమ్ మిర్రర్):** వైసీపీ ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్‌లను వదిలేసిందని మంత్రి నారాయణ అన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో 2014 నుంచి 2019 మధ్య చాలా స్టడీ చేసిన తర్వాత వేస్ట్‌తో విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని చెప్పారు. ఏడు మున్సిపాలిటీలు, ఒక కార్పొరేషన్ నుంచి చెత్తను ఈ ప్లాంట్‌కు తరలిస్తున్నారని తెలిపారు. మంగళవారం జీఎంసీ పరిధిలోని జిందాల్ ప్రాజెక్టును మంత్రి నారాయణ పరిశీలించారు. మంత్రి నారాయణతో పాటు ప్రాజెక్టును ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు , స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాబి పరిశీలించారు. మంత్రి నారాయణకు జిందాల్ పవర్ ప్లాంట్ పనులను అధికారులు వివరించారు. ప్లాంట్ నిర్వహణ, ఇతర వివరాలు అడిగి మంత్రి నారాయణ తెలుసుకున్నారు. 6890 మెట్రిక్ టన్నుల చెత్తలో 2500 టన్నుల చెత్తను రెండు ప్లాంట్స్ ద్వారా విద్యుత్‌గా మారుస్తున్నారని తెలిపారు. కాకినాడ, నెల్లూరులో త్వరలో ప్లాంట్‌లు ఏర్పాటు చేస్తామని అన్నారు. జగన్ ప్రభుత్వం ఒక్క ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేయలేదని చెప్పారు. చెత్త పన్ను వేయడం తప్ప చెత్తను ఎలా ఉపయోగించుకోవాలలో వైసీపీ ప్రభుత్వానికి తెలియదని అన్నారు.

# సంజయ్ మల్హోత్రకు అభినందనలు



**హైదరాబాద్,(క్రైమ్ మిర్రర్):** న్యూఢిల్లీ,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): సైబర్ సెక్యూరిటీ అంశం సవాల్‌గా మారుతోందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గవర్నర్ శక్తికాంతదాస్ అన్నారు. ఆర్బీఐ గవర్నర్‌గా తన చివరిరోజున విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొత్త ఆర్బీఐ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టనున్న సంజయ్ మల్హోత్రకు అభినందనలు తెలిపారు. ఆయనకు అపారమైన అనుభవం ఉందని, సీబీడీసీ, యూఎల్ఎక్స్ వంటి ఆర్బీఐ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించే సత్తా ఉన్న వ్యక్తి అని పేర్కొన్నారు. ఆయన ఇంకా మాట్లాడుతూ, సైబర్ సెక్యూరిటీ ఆర్బీఐ ముందున్న అతిపెద్ద సవాల్ అన్నారు. సైబర్ హెచ్చరికలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి కొత్త టెక్నాలజీని ఉపయోగించే అంశంపై దృష్టి సారించాలన్నారు. అలాగే, ద్రవ్యోల్బణం, వృద్ధి మధ్య సమతుల్యతలను పునరుద్ధరించడం అత్యంత ముఖమైన విషయమన్నారు. గత నాలుగేళ్లుగా కూరగాయల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని, దీంతో గత అక్టోబర్‌లో ద్రవ్యోల్బణం 14 నెలల గరిష్ఠస్థాయి 6.21 శాతానికి పెరిగిందన్నారు.ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర బ్యాంకు బృందానికి ఆయన ఎక్స్ వేదికగా కృతజ్ఞతలు తెలిపారు. ఈరోజు పదవీ విరమణ చేయనున్నానని... ఇన్నాళ్లు తనకు మద్దతుగా నిలిచిన వారికి ధన్యవాదాలు అని పేర్కొన్నారు. దేశానికి సేవ చేసే అవకాశం కల్పించిన మోదీకి ధన్యవాదాలు అని రాసుకొచ్చారు. ఆర్థికమంత్రిత్వ శాఖ, ఆర్బీఐ మధ్య గత ఆరేళ్లుగా సమన్వయం బాగుందని పేర్కొన్నారు.

# తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా దిల్ రాజు



హైదరాబాద్: టాలీవుడ్ అగ్ర నిర్మాత దిల్ రాజుకు తెలంగాణ ప్రభుత్వం కీలక పదవి కల్పించింది. తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఆయనను నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యార్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీచేశారు. ఆయన ఈ పదవిలో రెండేండ్ల పాటు కొనసాగనున్నారు. దిల్ రాజు అసలు పేరు వెంకటరమణా రెడ్డి. 1990లో పెళ్లి పందిరి సినిమాతో డిస్ట్రిబ్యూటర్‌గా కెరీర్ ప్రారంభించారు. అనంతరం దిల్ సినిమాతో నిర్మాతగా మారారు. ఆ చిత్రం విజయం సాధించడంతో ఆయన పేరు దిల్ రాజుగా మారింది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై సినిమాలు నిర్మిస్తున్నారు. భారీ బడ్జెట్ సినిమాలే కాకుండా చిన్ని చిత్రాలు కూడా నిర్మిస్తూ అనేకమందికి అవకాశాలు కల్పిస్తున్నారు. ఇండస్ట్రీలోకి కొత్తగా వస్తున్నవారిని ప్రోత్సహించేందుకు గాను దిల్ రాజు డ్రీమ్స్ పేరుతో కొత్త బ్యానర్ ప్రారంభిస్తున్నానని ఇటీవలే ప్రకటించారు. దీనికోసం ఒక వెబ్‌సైట్‌ను కూడా లాంచ్ చేయనున్నారు. ఆయన ప్రస్తుతం మూడు సినిమాలకు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. అగ్రదర్శకుడు శంకర్, రామ్‌చరణ్ కాంబినేషన్‌లో ఆయన నిర్మించిన భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్ చేంజర్' జనవరి 10న, వెంకటేశ్ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా జనవరి 14న విడుదల కానున్నాయి. వీటితోపాటు వేణు శ్రీరామ్ దర్శకత్వంలో 'తమ్ముడు' సినిమాను దిల్ రాజు నిర్మిస్తున్నారు.





# మార్చిలో సెట్స్‌మీదకు?

దేశవ్యాప్తంగా 'పుష్ప-2' అఖండ విజయంతో దూసుకుపోతున్నది. అన్ని భాషల్లో పుష్పరాజ్ హవా కొనసాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో త్రివిక్రమ్ దర్శకత్వంలో అల్లు అర్జున్ నటించబోతున్న తదుపరి సినిమాపై అభిమానుల్లో ఒక్కసారిగా ఆసక్తి పెరిగింది. ఈ సినిమా అప్‌డేట్స్ గురించి ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన ప్రీప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇక కథాంశం గురించి అనేక కథనాలు ప్రచారమవుతున్నాయి. దర్శకుడు త్రివిక్రమ్ ఈ సినిమా కోసం పీరియాడిక్ కథాంశాన్ని ఎంచుకున్నారని, పాన్ ఇండియాకు రీచ్ అయ్యేలా స్క్రిప్ట్‌కు మెరుగులు దిద్దుతున్నారని అంటున్నారు.

తాజా సమాచారం ప్రకారం మార్చిలో ఈ సినిమాను సెట్స్‌మీదకు తీసుకొస్తారని వార్తలు వినిపిస్తున్నాయి. 'పుష్ప-2' రికార్డు స్థాయి వసూళ్లు, అన్ని భాషల్లో లభిస్తున్న ఆదరణ దృష్ట్యా తన సినిమాకు సంబంధించిన నటీనటుల ఎంపికపై త్రివిక్రమ్ ప్రత్యేకంగా దృష్టి పెట్టారని చెబుతున్నారు. బాలీవుడ్‌తో పాటు వివిధ భాషలకు చెందిన అగ్ర నటులను సినిమాలో భాగం చేయబోతున్నారని సమాచారం. జులాయి, సన్నాఫ్ సత్యమూర్తి, అల వైకుంఠపురములో చిత్రాల తర్వాత త్రివిక్రమ్-బన్నీ కలయికలో రానున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలేర్పడ్డాయి. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై యస్.రాధాకృష్ణ ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు.



# దొంగగా కనిపించడం ఆనందం

"నా పదిహేనేళ్ల వయసులోనే నటిగా నా కెరీర్ మొదలైంది. ప్రేక్షకులకు వీలైనంత చేరువ కావాలని కథల ఎంపికలో ఎప్పటికప్పుడు నేను జాగ్రత్తలు తీసుకుంటుంటాను. ఇప్పటివరకు ఎన్నో భిన్నమైన పాత్రలు చేశాను. కానీ ఇప్పటివరకూ దొంగ పాత్రలో మాత్రం నటించలేదు. ఈ పాత్ర చేయాలనే నా ఆకాంక్ష 'సికందర్ కా ముఖద్దర్' చిత్రంతో నెరవేరినందుకు హ్యాపీగా ఉంది. నా కెరీర్‌లో ఈ పాత్ర నాకెంతో స్పెషల్" అని తమన్నా అన్నారు. జిమ్మీ షెర్గిల్, అవినాష్ తివారి, తమన్నా లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'సికందర్ కా ముఖద్దర్'. నీరజ్ పాండే దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా నవంబరు 29 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా తమన్నా మాట్లాడుతూ- "నేను చేసే పాత్ర చిన్నదా? పెద్దదా అనేది నాకు ముఖ్యం కాదు. ఆ కథను ఎంత ప్రభావితం చేస్తుందన్నది ముఖ్యం.పెద్దా చిన్నా తేడాల్లేకుండా వచ్చిన అవకాశాలతో ప్రేక్షకులను మెప్పించడమే నా లక్ష్యం. అలాగే ఒకే రకంగా ఉండే స్ట్రాంగ్ ఉమన్ రోల్స్ కాకుండా... కొత్త తరహా ఉమన్ రోల్స్ చేయా లని ఉంది" అని పేర్కొన్నారు.



# అలాంటి సినిమాలు తీయొద్దు

'గతకొంతకాలంగా మేల్ డామినేట్ స్టోరీస్ ఎక్కువగా వస్తున్నాయి. దశాబ్దాల కిందటే సమసిపోయిన పితృస్వామ్య భావాలను ప్రోత్సహించే కథాంశాలను తెరకెక్కిస్తున్నారు. అలాంటి చిత్రాలు బాక్సాఫీస్ వద్ద మంచి విజయాలను సాధిస్తున్నాయి. ఈ ధోరణి మంచిది కాదు. ఇప్పుడు సమాజం అన్ని రంగాల్లో ఆధునిక ఆలోచనలతో పురోగమిస్తున్నది. అయినా ఇప్పటికీ పరిష్కారించాల్సిన సామాజిక సమస్యలున్నాయి. వాటిపై దృష్టి పెడితే సమాజ అభ్యున్నతికి సృజనాత్మక మార్గంలో సహాయం చేసినవాళ్లమవుతాం. స్త్రీకి కొంతమేరకే స్వేచ్ఛనివ్వాలనే ఆలోచనలు పురుషుల్లోని అభద్రతాభావాన్ని సూచిస్తాయి. నేటి స్త్రీలు స్వీయ నిర్ణయాలతో ముందుకెళ్తున్నారు. వారిని ప్రోత్సహించాల్సిన బాధ్యత పురుషలపై ఉంది' అని అమీర్ వ్యాఖ్యానించారు. స్త్రీ సాధికారత ప్రధానాంశంగా ఆయన

# భానుమతి రామకృష్ణ సాక్షిగా..

## ఎన్టీఆర్ హీరోయిన్ ఫస్ట్ లుక్

దివంగత నందమూరి హరికృష్ణ మనవడు, నందమూరి జానకిరామ్ తనయుడు నందమూరి తారక రామారావుని హీరోగా పరిచయం చేస్తూ దర్శక, నిర్మాత వైవీఎస్ చౌదరి ఓ చిత్రాన్ని నిర్మించనున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో తెలుగమ్మాయి వీణారావు కథానాయికగా పరిచయం అవుతున్నది. శనివారం వీణారావు ఫస్ట్ లుక్‌ని ప్రొడ్యూసర్స్ సుప్రియ యార్లగడ్డ, స్వ్న దత్‌లు లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన షో గ్లింప్స్‌లో సంప్రదాయబద్ధంగా, మోడ్రన్ అవుట్ ఫిట్స్‌లో బ్యూటీఫుల్‌గా వీణారావు దర్శనమిచ్చారు. కథ, సన్నివేశాలు, పాత్రలకు అనుగుణంగా నటించి, ప్రేక్షకుల్ని రంజింపజేయడంలో తన వంతు కృషి చేస్తానని తన అభిమాన నటి డాక్టర్ పి.భానుమతి రామకృష్ణ సాక్షిగా వీణారావు ప్రమాణం చేశారు. తెలుగమ్మాయి వీణారావు ప్రతిభావంతురాలైన కూచిపూడి డ్యాన్సర్ అని, తెరపై అద్భుతమైన నటిగా కూడా రాణించే టాలెంట్ తనకుందని, యంగ్ చాప్ ఎన్టీఆర్ ఫస్ట్‌లుక్‌కి ప్రపంచవ్యాప్తంగా అద్భుతమైన స్పందన వచ్చిందని, అలాగే వీణారావు కూడా అందరికీ నచ్చుతుందని దర్శకుడు వైవీయస్ చౌదరి ఆశాభావం వెలిబుచ్చారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసిన నిర్మాతలు స్వప్నదత్, సుప్రియ యార్లగడ్డ చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. త్వరలో షూటింగ్ జరుపుకోనున్న ఈ చిత్రానికి మాటలు: సాయిమాధవ్ బుర్రా, సంగీతం: ఎం.ఎం.కీరవాణి, సాహిత్యం



Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.